

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 10-07-2025 | సంపుటి - 24 | సంచిక - 67 | రూ : 4 | పేజీలు: 8


# ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నమీబియా అత్యున్నత పురస్కారం



- నమీబియా అత్యున్నత పౌర పురస్కారం అందుకున్న ప్రధాని మోదీ
- అవార్డును ప్రదానం చేసిన నమీబియా అధ్యక్షురాలు నెతుంబో నంది-ద్వైత్వా
- ఈ గౌరవం పొందిన తొలి భారత నేతగా మోదీ రికార్డు
- 2014 నుంచి మోదీకి ఇది 27వ అంతర్జాతీయ పురస్కారం
- ఆరోగ్యం, ఇంధన రంగాల్లో ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు
- ప్రస్తుత పర్యటనలో నాలుగు దేశాల నుంచి అత్యున్నత గౌరవాలు

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ పురస్కారాన్ని చేర్చుకున్నారు. ఐదు దేశాల పర్యటనలో చివరిగా నమీబియాకు చేరుకున్న ఆయన, ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్షియా మిరాబిలిస్'ను అందుకున్నారు. బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో నమీబియా అధ్యక్షురాలు నెతుంబో నంది ద్వైత్వా ఈ గౌరవాన్ని ప్రధాని మోదీకి అందజేశారు. ఈ

తరువాయి 2లో



అమర్‌నాథ్ యాత్రకు వెల్లువెత్తిన భక్తులు..

## ఆరు రోజుల్లో లక్ష దాటిన దర్శనాలు

- అమర్‌నాథ్ యాత్రకు భారీగా తరలివస్తున్న భక్తులు
- మొదటి ఆరు రోజుల్లోనే 1.11 లక్షల మందికి పైగా దర్శనం
- జమ్మూ నుంచి మరో 7,579 మంది యాత్రికులతో కొత్త బ్యాచ్ పయనం
- గత ఉగ్రదాడి నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు
- యాత్రికులకు సంపూర్ణ సహకారం అందిస్తున్న స్థానిక కశ్మీరీలు

పవిత్ర అమర్‌నాథ్ యాత్ర భక్తి శ్రద్ధలతో, అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ విజయవంతంగా కొనసాగుతోంది.

తరువాయి 2లో

## ఏపీలో రేపు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

## ఒకేరోజు 2 కోట్ల మందితో రికార్డుకు సిద్ధం!

- రేపు రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0
- ఒకేరోజు 2.28 కోట్ల మంది భాగస్వామ్యంతో రికార్డుకు సన్నాహాలు
- పుట్టపర్తిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభం
- మంత్రి లోకేశ్ ఆలోచనతో ప్రభుత్వ బడుల్లో ఈ కార్యక్రమం
- తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డుల అందజేత
- పాఠశాలల పనితీరుపై అభిప్రాయాలు, సూచనల స్వీకరణ

ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

తరువాయి 2లో








## ట్రంప్ సుంకాల గండం..

## ఫార్మా, రాగి ఎగుమతులపై ఆందోళన

- రాగి దిగుమతులపై 50 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్
- ఏడాది తర్వాత ఫార్మా ఉత్పత్తులపై 200 శాతం టారిఫ్ హెచ్చరిక
- భారత ఫార్మా ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం
- ఆగస్టు 1 గడువును పొడిగించేది లేదని స్పష్టం చేసిన అమెరికా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాల అస్త్రాన్ని ప్రయోగించారు. ఇప్పటికే ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీ సుంకాలు విధించిన ఆయన, తాజాగా రాగి (కాపర్) దిగుమతులపై ఏకంగా 50 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా ఏడాది తర్వాత ఫార్మా ఉత్పత్తులపై 200 శాతం వరకు పెనుభారం

తరువాయి 2లో

## కేసీఆర్, జగన్‌పై మరోసారి

# రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు



- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, జగన్ బంధంతో తెలంగాణకు తీవ్ర నష్టం
- కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ నిర్ణయాలు ఓ మరణశాసనం
- రాయలసీమకు మేలు చేసేలా కేసీఆర్ వ్యవహరించారని ఆరోపణ
- జూరాల నుంచే నీళ్లు తెచ్చుకుంటే ఏపీకి అవకాశం దక్కేది కాదు
- కేసీఆర్ వల్లే రాష్ట్రానికి విద్యుత్ భారం పెరిగిందన్న రేవంత్ రెడ్డి

మాజీ ముఖ్యమంత్రులు కె. చంద్రశేఖర్ రావు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మధ్య ఉన్న అనుబంధం కారణంగా తెలంగాణకు పూడ్చలేని నష్టం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర రైతాంగానికి మరణశాసనంగా మారాయని ఆయన ఆరోపించారు. బుధవారం కృష్ణా జలాలపై మంత్రి ఉత్తమ్

తరువాయి 2లో

## వారిని కాల్చిపారేయండి

## షేక్ హసీనా ఆడియో లీక్..

- బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా సంచలన ఆడియో లీక్
- నిరసనకారులను కాల్చివేయాలని పోలీసులకు ఆదేశాలు
- గత ఏడాది రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనల నాటి ఘటన
- బీబీసీ పత్రాల ఆధారంగా వెలుగులోకి వచ్చిన ఉదంతం
- అల్లర్లలో 1400 మంది మృతి చెందారని ఐక్యరాజ్యసమితి అంచనా
- ప్రస్తుతం భారత్‌లో తలదాచుకుంటున్న షేక్ హసీనా



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు సంబంధించిన ఒక కీలకమైన ఆడియో లీక్ కావడంతో రాజకీయంగా పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గత సంవత్సరం జరిగిన ఆందోళనల సమయంలో నిరసనకారులపై కాల్పులు జరపాలని ఆమె స్వయంగా ఆదేశించినట్లు ఈ

తరువాయి 2లో

## ట్రంప్ సుంకాల గండం..
# ఫార్మా, రాగి ఎగుమతులపై ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

మోపనున్నట్లు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ నిర్ణయాలు భారత్‌పై, ముఖ్యంగా దేశ ఫార్మా రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ట్రంప్ ఈ కీలక ప్రకటన చేశారు. “ఈరోజు మేము రాగిపై చర్యలు తీసుకుంటున్నాం. దానిపై సుంకాన్ని 50 శాతంగా నిర్ణయించబోతున్నాం” అని ఆయన తెలిపారు. ఈ కొత్త సుంకాలు జులై చివరి నాటికి లేదా ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి రావచ్చని అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లట్నిక్ వెల్లడించారు. ఫార్మా రంగంపై కూడా త్వరలోనే ప్రకటన ఉంటుందని, అయితే ఔషధ తయారీ సంస్థలు తమ కార్యకలాపాలను అమెరికాకు మార్చుకోవడానికి ఏడాది నుంచి ఏడాదిన్నర సమయం ఇస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. “ఆ తర్వాత వారిపై 200 శాతం వంటి చాలా అధిక రేటుతో సుంకాలు విధిస్తాం” అని ఆయన హెచ్చరించారు. ట్రంప్ తాజా నిర్ణయాలు భారత ఎగుమతిదారులను కలవరపెడుతున్నాయి. అమెరికా భారత ఫార్మా ఉత్పత్తులకు అతిపెద్ద మార్కెట్. 202425 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి అమెరికాకు 9.8 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఎగుమతులు జరిగాయి. ఇది మన మొత్తం ఫార్మా ఎగుమతులలో 40 శాతానికి సమానం. ఒకవేళ 200 శాతం సుంకం అమలైతే భారత ఫార్మా పరిశ్రమ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇక రాగి ఎగుమతుల్లో అమెరికాకు భారత్ నుంచి 17 శాతం వాటా ఉంది.

## ప్రధానమంత్రి నరేంద్రమోదీకి
# నమీబియా అత్యున్నత పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

పురస్కారం పొందిన తొలి భారతీయ నేతగా ప్రధాని మోదీ నిలవడం గమనార్హం. 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన అందుకున్న 27వ అంతర్జాతీయ పురస్కారం ఇది. ప్రధానమంత్రి హోదాలో నరేంద్ర మోదీ నమీబియాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటన సందర్భంగా ఆయన ఆ దేశ అధ్యక్షురాలితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఆరోగ్య సంరక్షణ, ఇంధనం వంటి కీలక రంగాల్లో సహకారం కోసం నాలుగు ఒప్పందాలపై సంతకాలు చేశారు. కాగా, నమీబియాలో పర్యటించిన మూడో భారత ప్రధానిగా మోదీ నిలిచారు. ఈ నెల 2న ప్రారంభమైన ప్రధాని ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఇప్పటికే ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్ దేశాలను సందర్శించారు. బ్రెజిల్‌లోని రియోలో జరిగిన బ్రిక్స్ సదస్సులో కూడా పాల్గొన్నారు. ఈ పర్యటనలో అర్జెంటీనా మినహా మిగిలిన నాలుగు దేశాల అత్యున్నత పురస్కారాలను అందుకోవడం విశేషం.

## ఏపీలో రేపు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్
# ఒకేరోజు 2 కోట్ల మందితో రికార్డుకు సిద్ధం!

(మొదటిపేజీ తరువాయి)

రేపు (గురువారం) రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని విద్యా సంస్థల్లో “మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0” నిర్వహించనుంది. ఒకేరోజు దాదాపు 2.28 కోట్ల మందిని భాగస్వాములను చేస్తూ సరికొత్త రికార్డు సృష్టించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగే ప్రధాన కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలతో కలిపి మొత్తం 61 వేల విద్యా సంస్థలు పాలుపంచుకోనున్నాయి. ఈ సమావేశంలో 74.96 లక్షల మంది విద్యార్థులు, 3.32 లక్షల మంది ఉపాధ్యాయులు, కోటిన్నరకు పైగా తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు పాల్గొననున్నారు. కార్పొరేట్ పాఠశాలలకే పరిమితమైన పేరెంట్ టీచర్ సమావేశాలను ప్రభుత్వ బడుల్లోనూ నిర్వహించాలన్న మంత్రి నారా లోకేశ్ ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది రెండో ముఖ్యమైన విద్యా సంబంధిత కార్యక్రమం కావడం గమనార్హం. ఈ సమావేశం ద్వారా తమ పిల్లల చదువు, ప్రవర్తన, ఇతర నైపుణ్యాల పురోగతిని తల్లిదండ్రులు నేరుగా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవచ్చు. విద్యార్థుల సమగ్ర ప్రోగ్రెస్ కార్డులను ఈ సందర్భంగా తల్లిదండ్రులకు అందజేస్తారు. అంతేకాకుండా, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధన తీరుపై తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను, సూచనలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఇది ఒక చక్కటి వేదికగా ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమాన్ని ఏటా పండుగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## అమర్‌నాథ్ యాత్రకు వెల్లువెత్తిన భక్తులు..
# ఆరు రోజుల్లో లక్ష దాటిన దర్శనాలు

(మొదటిపేజీ తరువాయి)

యాత్ర ప్రారంభమైన కేవలం ఆరు రోజుల వ్యవధిలోనే 1.11 లక్షల మందికి పైగా భక్తులు మంచులింగాన్ని దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో యాత్ర నిర్విఘ్నంగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం జమ్మూలోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి 7,579 మంది భక్తులతో కూడిన మరో బ్యాచ్ కశ్మీర్‌కు బయలుదేరింది. వీరిలో 3,031 మంది బాల్తాల్ బేస్ క్యాంప్‌కు, 4,548 మంది పహల్గామ్ బేస్ క్యాంప్‌కు ప్రత్యేక భద్రతా కాన్వాయ్‌ల మధ్య తరలివెళ్లినట్లు అధికారులు తెలిపారు. జమ్మూ నుంచి వచ్చే యాత్రికులతో పాటు చాలామంది నేరుగా బాల్తాల్, పహల్గామ్ బేస్ క్యాంపుల వద్దకు చేరుకుని అక్కడికక్కడే రిజిస్ట్రేషన్ (ఆన్‌స్పాట్) చేసుకుని యాత్రలో పాల్గొంటున్నారని శ్రీ అమర్‌నాథ్‌జీ పుణ్యక్షేత్రం బోర్డు (ఎస్ఏఎస్‌బీ) అధికారులు వెల్లడించారు.

**కనీవినీ ఎరుగని భద్రత**

ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని బైసరన్ వద్ద ఉగ్రవాదులు 26 మంది పౌరులను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడి నేపథ్యంలో ఈ ఏడాది యాత్రకు అధికా రులు అసాధారణ భద్రతా ఏర్పాట్లు చేశారు. సైన్యం, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఎస్ఎస్‌బీ, స్థానిక పోలీసులతో పాటు అదనంగా 180 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. భద్రతా కారణాల రీత్యా ఈ సంవత్సరం యాత్రికులకు హెలికాప్టర్ సేవలను అందుబాటులో ఉంచడం లేదని స్పష్టం చేశారు.

**అండగా నిలుస్తున్న స్థానికులు**

భద్రతాపరమైన ఆందోళనలు ఉన్నప్పటికీ స్థానిక కశ్మీరీలు యాత్రికులకు సంపూర్ణ సహకారం అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. యాత్రికుల మొదటి బ్యాచ్ కశ్మీర్‌లోకి ప్రవేశించగానే స్థానికులు పూలమాలలతో స్వాగతం పలికారు. ఇటీవల శ్రీనగర్‌కు చెందిన కొందరు స్థానికులు 30 కిలోమీటర్లు ప్రయాణించి, యాత్ర ముగించుకుని వస్తున్న భక్తులకు శీతల పానీయాలు, మంచినీరు అందించారు. ఈ యాత్ర ఈ నెల 3న ప్రారంభమైంది. మొత్తం 38 రోజుల పాటు కొనసాగి, శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన్ పర్వదినమైన ఆగస్టు 9న ముగియనుంది.

## కేసీఆర్, జగన్‌పై మరోసారి
# రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు..

కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం సీఎం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. “బేసిన్లు, బేషజాలు లేవంటూ కేసీఆర్ గతంలో అన్నారు. గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, వాటిని కృష్ణా, పెన్నా బేసిన్లకు తరలించి రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పారు. ఇందులో భాగంగా జగన్‌కు సలహాలు ఇవ్వడమే కాకుండా, టెండర్లు, జీవోల విషయంలోనూ సహకరించారు” అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చిన నీటిని వచ్చినట్లే ఒడిసి పట్టుకోవాల్సింది పోయి, ఏపీకి వెళ్లాక చివరిలో తీసుకోవడం వల్ల తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందని ఆయన అన్నారు. తుంగభద్ర, కృష్ణా జలాలు మొదట గద్వాలలోని జూరాలకు వస్తాయని, అక్కడే పాలమూరు రంగారెడ్డి, నల్గొండ ప్రాజెక్టులకు నీటిని తరలించి ఉంటే ఏపీ జలాలను కొల్లగొట్టే అవకాశం ఉండేది కాదని రేవంత్ అభిప్రాయపడ్డారు. కేసీఆర్ తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్లే కృష్ణా పరివాహక ప్రాంత రైతులు నష్టపోయారని అన్నారు. “గత ప్రభుత్వం సరిగ్గా వాదించి ఉంటే హైదరాబాద్ తాగునీటి సమస్య తీరేది. అంతేకాకుండా, ప్రాజెక్టులలో రాష్ట్రానికి రావాల్సిన వాటా కోల్పోవడం వల్ల తక్కువ ధరకు లభించాల్సిన విద్యుత్‌ను కూడా కోల్పోయాం” అని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు మరణశాసనం రాసే హక్కు కేసీఆర్‌కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు.

## వారిని కాల్చిపారేయండి
# షేక్ హసీనా ఆడియో లీక్..

(మొదటిపేజీ తరువాయి)

ఆడియోలో ఉంది. ఈ ఉదంతం ఇప్పుడు బంగ్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. బీబీసీకి చెందిన పత్రాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు ఈ వార్తను ప్రచురించాయి. దీని ప్రకారం, గత సంవత్సరం జులై 18న ఢాకాలోని తన అధికార నివాసం ‘గణభబన్’ నుంచి ఒక ఉన్నత పోలీస్ అధికారికి హసీనా ఫోన్‌లో ఈ ఆదేశాలు జారీ చేశారు. “నిరసనకారులను అణచివేయడానికి ప్రాణాంతక ఆయుధాలు వాడండి. వాళ్లు ఎక్కడ కనిపిస్తే అక్కడ కాల్చేయండి” అని ఆమె ఆదేశించారు. ఈ ఆదేశాలు జారీ అయిన కొద్ది గంటలకే పోలీసులు నిరసనకారులపై బలప్రయోగం చేసినట్లు బీబీసీ నివేదిక వెల్లడించింది. కాగా, బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారి తీవ్ర అల్లర్లకు దారితీశాయి. ఈ ఘర్షణల్లో సుమారు 1,400 మంది మరణించినట్లు ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఈ నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో హసీనా ప్రభుత్వం కుప్పకూలింది. అనంతరం ఆమె దేశం విడిచి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ప్రస్తుతం మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం హసీనాను తిరిగి దేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఆమెపై బంగ్లాదేశ్‌లో ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించడం కూడా గమనార్హం.

# సింహాచలం గిరి ప్రదక్షిణ
## విశాఖలో ట్రాఫిక్ ఆంక్షలు.. ఈ రూట్లలో వెళ్లొద్దు!

* **రేపు సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు**
* **అడివివరం, గోపాలపట్నం మధ్య వాహనాలకు ప్రవేశం బంద్**
* **భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు**
* **నగరంలోకి భారీ వాహనాల రాకపోకలపై నిషేధం, మళ్లింపు**
* **ప్రయాణికులు సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి**



సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి వార్షిక గిరి ప్రదక్షిణ మహోత్సవం సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ వెల్లడించారు. ఈ ఆంక్షలు నేటి నుంచి రేపు (గురువారం) సాయంత్రం 5 గంటల వరకు అమల్లో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. భక్తులు, నగరవాసులు ఈ మార్పులను గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు. గిరి ప్రదక్షిణకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం పలు కీలక మార్గాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించినట్టు తెలిపారు. ఈ ఉదయం 6 గంటల నుంచే అడివివరం, గోపాలపట్నం పెట్రోల్ బంక్ మధ్య రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. అడివివరం వైపు నుంచి వచ్చే భక్తులు తమ వాహనాలను అడివివరం కూడలి వద్ద పార్క్ చేసి, కాలినడకన స్వామివారి తొలి పావంచాకు చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా, వేపగుంట, గోపాలపట్నం నుంచి వచ్చేవారు సింహపురం కాలనీ వద్ద కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలపాల్సి ఉంటుంది. ఇక సత్తరువు జంక్షన్ నుంచి అడివివరం వైపునకు మాత్రమే వాహనాలను అనుమతిస్తామని, అక్కడి నుంచి హనుమంతువాక వైపు వెళ్లేందుకు వీలులేదని స్పష్టం చేశారు. అలాగే గోపాలపట్నం పెట్రోల్ బంక్ నుంచి పాత



గోశాల కూడలి వైపు కూడా వాహనాలకు ప్రవేశం లేదని తెలిపారు. భారీ వాహనాల రాకపోకలపైనా ఆంక్షలు విధించారు. పెందుర్తి, ఎన్ఏడీ కూడళ్ల నుంచి గోపాలపట్నం వైపు భారీ వాహనాలను అనుమతించబోమని తెలిపారు. అనకాపల్లి నుంచి విశాఖ నగరంలోకి ప్రవేశించే భారీ వాహనాలను లంకెలపాలెం కూడలి వద్ద సబ్బవరం వైపు మళ్లిస్తున్నట్లు వివరించారు. ఈ మార్పులకు అనుగుణంగా ప్రయాణికులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

## సాగర్‌కు కొనసాగుతున్న వరద ప్రవాహం

* **సుంకేసుల, జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద**
* **నాగార్జునసాగర్ జలాశయానికి ఇన్ ఫ్లో 1,05,764 క్యూసెక్కులు**
* **నాగార్జునసాగర్ ప్రస్తుత నీటి మట్టం 534.50 అడుగులు**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణా నదిలో వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుం కేసుల నుంచి భారీగా వరద నీరు శ్రీశైలం డ్యామ్‌కు చేరుతుండటంతో శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. ప్రాజెక్టు గరిష్ట మట్టానికి నీరు చేరడంతో నిన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నాలుగు గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి లక్షకు పైగా క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. దీనితో నాగార్జున సాగర్ జలాశయానికి 1,05,764 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. ఔట్ ఫ్లో 9,334 క్యూసెక్కులుగా నమోదైంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 534.50 అడుగులుగా ఉంది.



# మెగా ఆధార్ క్యాంపుకు విశేష స్పందన...

* **మండలాల వారీగా ఆధార్ క్యాంపులు**
* **అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మెగా క్యాంపుకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది అని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించు మెగా ఆధార్ క్యాంపును అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ ప్రారంభించారు. ఆధార్ వివరాల నవీకరణ, చిన్నపిల్లల బయోమెట్రిక్ నమోదు, చిరునామా మార్పులు, మొబైల్ నెంబర్ అనుసంధానం వంటి సేవలు ఒకే చోట అందుబాటులో ఉండటంతో పెద్ద ఎత్తున ప్రజలు మెగా ఆధార్ క్యాంపుకు విచ్చేసి సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున మెగా ఆధార్ క్యాంపు కు ప్రజలు తరలివచ్చారని, వారికి అనుగుణంగా కావలసిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి బృంద సభ్యులు ఆదార్ సమస్యలపై తగిన పరిష్కారాలు చూపించారన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వారి సౌకర్యార్థం ప్రతి మండల కేంద్రంలో ఆధార్ క్యాంపును నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు ఆధార్ నవీకరణ , సవరణకు వస్తున్నందువలన ప్రతి మండలంలో షెడ్యూల్ వారిగా ఆధార్ క్యాంపులు ప్రజలకు మరింత సౌకర్యంగా ఉండేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 23 మండలాల్లో వేర్వేరు తేదీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.జూలై 10, 11 తేదీలలో : కొత్తగూడెం, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, జులూరు పాడు, చంద్రుగొండ మండలాలకు కలెక్టర్ కార్యాలయంలోని నవభారత్ హాలులో ఆధార్ సేవలు అందించనున్నారు. జూలై 14, 15, 16 తేదీలలో : భద్రాచలం, బుర్గంపాడు,



చర్ల, దుమ్ముగూడెం మండలాలకు భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో,ఇల్లందు, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల మండలాలకు ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో క్యాంపులు జరుగుతాయి. జూలై 15, 16, 17 తేదీలలో : దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయంలో దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి , అశ్వరావుపేట మండలాలకు , మణుగూరు ఎంపీడీఓ కార్యాలయంలో మణుగూరు, అశ్వాపురం, పినపాక, కారకగూడెం మండలాలకు క్యాంపులు నిర్వహించనున్నారు.ప్రతి కేంద్రంలో అవసరానికి తగిన విధంగా ఆధార్ కిట్లు అందుబాటులో ఉంచి వేగవంతంగా సేవలు అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో ప్రజలు ఆధార్ సమస్యలను పరిష్కరించుకునే వరకు నిరంతరంగా ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ యు ఐ డి ఐ అసిస్టెంట్ మేనేజర్ మహమ్మద్ సౌభన్, జిల్లా ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వర రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందజేయాలని మండల తాహసిల్దార్ కు వినతి



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : బొమ్మల రామారం మండల కేంద్రంలో మలోత్ వినోద్ నాయక్ అధ్వర్యంలో బుధవారం బొమ్మలరామారం మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, అర్హులైన వాళ్లందరికీ అందజేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్వో కి మెమోరాండం పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా బొమ్మల రామారం మండల బీజేపీ అధ్యక్షుడు మలోత్ వినోద్ నాయక్ మాట్లాడుతూ గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను గ్యారెంటీగా మరిచిపోయింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పకీరు రాజేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రవీందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బాలరాజు,సాయి కుమార్, ప్రవీణ్ రెడ్డి, ఎల్లా గౌడ్, గణేష్ మోహన్,డాక్టర్ పాండు, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన హేరే కార్ శ్రీను




యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ. సీతక్క కి జన్మదిన సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలో వారి నివాసంలో కలిసి పూల బొకే శాలువాతో శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హేరే కార్ శ్రీను ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతక్కకి సమ్మక్క సారక్క యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి కృపాకటాక్షాలు ఉండి ఇలాంటి పుట్టినరోజులు మరో ఎన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి కరీం సుబ్బురు సిద్దేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల చుట్టు రాత్రి వేళల్లో వెలుతురు ఉండేలా లైట్లు అమర్చాలి

* **బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి సతీష్ రావు**




శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : పాఠశాల కాంపౌండ్ వాల్ చుట్టు రాత్రి వేళల్లో వెలుతురు ఉండేలా లైట్లు అమర్చాలని బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి సతీష్ రావు అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ శ్రీ రామ్ నగర్ కాలనీ లోని మండల్ పరిషత్ ప్రాథమిక పాఠశాల చూట్టు పరిసరాల రాత్రి వేళలో లైట్లు లేక , పరిసరాలు శుభ్రం లేక ప్రతిరోజూ పాఠశాల ప్రాంగణంలోకి పాములు వస్తుండడంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పాఠశాలని పరిశీలించారు.ఈ సందర్భంగా సతీష్ రావు మాట్లాడుతూ పాఠశాల కాంపౌండ్ వాల్ చుట్టు రాత్రి వేళల్లో వెలుతురు ఉండేలా లైట్లు అమర్చి, స్నేక్ రిపేలెంట్ పౌడర్ లేదా కిరోసిన్ పోసి పాములు , ఇతర కీటకాలు రాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, శివ సాగర్, కళ్యాణ్, వెంకటేశ్వర రావు, మున్నీర్, రాజు, అరవింద్, మాధవరెడ్డి, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు

## విమర్శించే హక్కు మీకెక్కడిది: మద్ది వీరారెడ్డి

* **పక్క మండలం జిన్నారం రైతులకే న్యాయం చేయలేని చేతగాని దద్దమ్మము**
* **మీ హయంలో సిద్దిపేటకు ఒక న్యాయం,మల్లన్న సాగర్ కి ఒక న్యాయం చేసిన సిగ్గుమాలిన ప్రభుత్వం మీది**
* **కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు మీకు లేదు**



పటాన్ చెరు(గుమ్మడిదల),ప్రజాస్ఫూర్తి08: సిగ్గుమాలిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపైన అవాక్కులు, చవాక్కులు మాట్లాడుతున్నారని, బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు పక్కనే ఉన్న జిన్నారం సర్వే నంబర్ ఒకటి, జంగంపేట రైతులకు న్యాయం చేయని దద్దమ్మలు కొడంగల్ గుమ్మడిదలకు లింకు పెడుతున్నారని గుమ్మడిదల మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని,రేవంత్ రెడ్డిని విమర్శించిన మండల బీఆర్ఎస్ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేటకు ఒక న్యాయం,మల్లన్న సాగర్ రైతులకు ఒక న్యాయం చేసిన సిగ్గుమాలిన ప్రభుత్వం మీదని అన్నారు. మీరు చేసిన దిక్కుమాలిన పనివల్ల ఇప్పటివరకు మల్లన్న సాగర్ రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాహయంలోనే రైతులకు న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు.



## పట్టణ, జిల్లా మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

* **సకాలంలో పట్టణ శాఖల మహాసభలు పూర్తి చేయండి**
* **కొత్తగూడెం పట్టణ సీపీఐ ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 21న జరగనున్న కొత్తగూడెం పట్టణ మహాసభ అదేవిధంగా 26, 27తేదీల్లో అశ్వారావుపేటలో జరిగే జిల్లా మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా కార్యకర్తలకు సూచించారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో జరిగిన కొత్తగూడెం పట్టణ ముఖ్య నాయకుల సమావేశానికి అయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 15 మండలాల మహాసభలు పూర్తి చేశామని, యువజన సమాఖ్య, విద్యార్థి సమాఖ్య జిల్లా మహాసభలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నెల 21లో కొత్తగూడెం పట్టణంలోని వార్డు, బస్తి శాఖల మహాసభలు పూర్తి చేసి పట్టణ మహాసభకు సిద్ధం కావాలన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడు ప్రకటించినా పార్టీ శ్రేణులు ఎన్నికల్లో తలబడేందుకు సిద్ధంగా వుండాలని సూచించారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని కృషితో కొత్తగూడెం పట్టణంతోపాటు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తద్వారా పార్టీకి మరింత బలం పెరిగేలా చొరవతీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, వేంగా వెంకట్, మునిగడప వెంకటేశ్వర్లు, గెద్దాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, ఎస్ కె ఫహీమ్, వివిధ వార్డులు, పార్టీ శాఖల కార్యదర్శులు, బాధ్యులు పాల్గొన్నారు.




## ప్రైవేటీకరణ ముప్పునుంచి ప్రభుత్వ సంస్థలను రక్షించుకుందాం

* **విపక్షాల జిల్లా నేతలు ఎస్ కె సాబీర్ పాషా, మచ్చ వెంకటేశ్వర్లు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షణ, ప్రజా హక్కులను కాలరాస్తూ పాలనా సాగిస్తోందని, కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు, చట్టాలు అన్నివర్గాలకు గుదిబండగా మారుతున్నాయని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, న్యూ డిమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు అన్నారు. కేంద్రప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేఖ విధానాలు, కార్మికచట్టాల సవరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్ల ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటీ రంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులు బుధవారం స్వచ్ఛందంగా సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె సందర్భంగా పట్టణంలోని ఓల్డ్ డిపో సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్తూపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. ఎనిమిది గంటల పనివిధానాన్ని రద్దు చేసి శ్రమ దోపిడీకి కేంద్రం తెరలేపిందని విమర్శించారు. ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని కల్పించి, రూ.600కూలి చెల్లించాలని విపక్షాలు డిమాండ్ చేస్తుంటే కేంద్రం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ కార్మికులు, ఉద్యోగులకు ఉపాధి లేకుండా చేస్తోందని, ప్రజలకు చెందాల్సిన సహజ వనరులను పెట్టువాడిదారీ వర్గాలకు కట్టబెడుతోందని విమర్శించారు. కేంద్రం తీరుకు నిరసనగా జరిగిన సమ్మె విజయవంతమైందని, ఈ సమ్మె కేంద్రానికి గుణపాఠం కానుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు నరాటి ప్రసాద్, చంద్ర నరేంద్రకుమార్, కంచర్ల జమలయ్య, వంగ వెంకట్, వాసిరెడ్డి మురళి, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి, సిపిఎం, సిఐటియు నాయకులు ఏజే రమేష్, మధు, భూక్యా రమేష్, లిక్కి బాలరాజు, న్యూ డిమోక్రసీ, మాస్ లైన్, ఇఫ్టూ, టియుసిఐ నాయకులు సంజీవ్, మల్లికార్జున్, సారంగపాణి, సురేందర్, యాకుబ్ శావలి, కెచ్చెల రంగయ్య, కందగట్ల సురేందర్, ఏఐటీయూసీ నాయకులు గౌనె మని, విజయలక్ష్మి, అమర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడండి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం బందనకల్ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 798 వెంకట్రావుపల్లెలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని బిజెపి మండల అధ్యక్షుడు సౌల్ల క్రాంతి కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌కు బిజెపి పార్టీ ఆధ్వర్యంలో గ్రామ రైతులు, వివిధ కుల సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందనకల్ గ్రామంలోని సర్వే నెంబర్ 798లోని ప్రభుత్వ భూమిలో గత పది సంవత్సరాలుగా ఐకెపి సెంటర్ కొనసాగుతుందని తెలిపారు. అయితే ఇక్కడ ఐకెపి సెంటర్‌ను తొలగించి, భూమిని ఆక్రమించేందుకు కొందరు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సెల్ మెంబర్ మెరుగు అంజా గౌడ్, బూత్ అధ్యక్షులు అగ్రహారం శేఖర్, కస్తూరి కార్తీక్ రెడ్డి, కోల కృష్ణా, వెంకట్రావుపల్లె గ్రామ రైతులు, కుల సంఘాల నాయకులు ఎల్కపెల్లి మహేందర్ యాదవ్, బాపి రెడ్డి, బరిగే బాబు ముదిరాజ్, దుర్గయ్య మాదిగ, కనకరాజు రజక, పల్లాటి సత్తయ్య మాల, గదగోని శంకర్ గౌడ్, పుల్లురి రాజు, జెల్ల ఎల్లం, పెంజర్ల పద్మ రెడ్డి, మాడికంటి వినోద్, నీరటి రాజు, రవి, శంకరయ్య, ఎల్లయ్య పర్శ రాములు, తిరుపతి, రాజిరెడ్డి, బాల్ రెడ్డి, సంజీవ రెడ్డి, దేవయ్య, ప్రతాప రెడ్డి, తిరుపతి రెడ్డి, మెంట మోహన్, మడికంటి శరబయ్య తదితరులున్నారు.

## ప్రభుత్వ భూములు కాపాడండి

* **కబ్జాదారులపై చర్యలు తీసుకోండి:**
* **తహసీల్దార్ కు ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి:**



ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ :ప్రభుత్వ భూములు కాపాడాలని ఏంఆర్పీఎస్ నాయకులు కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కు కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ సుజాత ను ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలి సారు. ఇప్పటికే దేవేందర్ నగర్, కైసర్ నగర్ లో ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూములు కబ్జా అయ్యాయని ఇకనుండి అయినా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని తహసీల్దార్ కు వినతిపత్రం ఇచ్చారు. కుత్బుల్లాపూర్ మండలంలో జరుగుతున్న కబ్జాలను అరికట్టాలని, కబ్జాలకు పాల్పడే వారిని కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ సర్టిఫికెట్ త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని విద్యార్థుల సమస్య ను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధికార ప్రతినిధి సిలువేరు శ్రీనివాస్ మాదిగ,మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు రాసమల్ల యాదగిరి మాదిగ, మట్ట నర్సింలు మాల,బిఎస్పి నాయకురాలు సాబేర బేగం, బిసి నాయకులు మురళి రజక, దోర్నాల వెంకటేష్ పద్మశాలి,రాము, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పి. రామదాసు గౌడ్



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆల్విన్ కాలనీ డివిజన్ చెందిన పి. రామదాసు గౌడ్ నియమితులయ్యారు.తనపై నమ్మకంతో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రామదాసు గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్న తనకు టీపీసీసీ గుర్తించి ఈ పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి ఎల్ల వేళలా కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావటానికి కృషిచేసిన పిసీసీ అధ్యక్షులు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# సింగరేణి మహిళా డిగ్రీ , పీజీ కళాశాలలో 50 వసంతాల స్వర్ణోత్సవ వేడుకలు






ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ , పీజీ కళాశాలలో 50 వసంతాల స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ సారథ్యంలో కరెస్పాండెంట్ జీకే కిరణ్ కుమార్ పర్యవేక్షణలో ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద అధ్యక్షతన సైన్స్ విభాగం వారి ఆధ్వర్యంలో సైన్స్ ఎక్స్ పో కార్యక్రమం కళాశాల ఆడిటోరియం ఉ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ డి.కాశీనాథ్ డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఎన్ఐటి వరంగల్ హాజరయ్యారు. ముందుగా కార్యక్రమ నిర్వాహక కార్యదర్శి డాక్టర్ జి శైలజ కార్యక్రమ నివేదికను సమర్పించారు. తదుపరి ముఖ్యఅతిథి కాశీనాథ్ మాట్లాడుతూ మానవ జీవన గమనంలో ప్రతి దశలో సైన్స్ అంతర్భాగమని, సైన్స్ లేని జీవితమే లేదని, సైన్స్ సమాజం రెండూ అవినాభావ సంబంధాన్ని కలిగి ఉన్నాయని అలాగే వేప, పసుపు వంటి సాంప్రదాయ ఔషధాల ఉపయోగాల గురించి, జన్యుపరమైన క్యాన్సర్లను గుర్తించే నానో టెక్నాలజీ అప్లికేషన్స్ ఆవశ్యకతను గూర్చి విపులంగా వివరించారు. కార్యక్రమ గౌరవ అతిథి గుండా శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయులు నిరంతర అన్వేషకులు అని దేనినైనా శోధించి వాస్తవాన్ని గ్రహిస్తారని, ప్రతి విద్యార్థి ఇలాంటి సైన్స్ ఎక్స్పోల ద్వారా తమలో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలని వెలికి తీసి మహిళా సైంటిస్ట్ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మరొక గౌరవ అతిథి జీ.కే. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి సైన్స్ ఎక్స్పోల ద్వారా విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించడంతోపాటు శాస్త్రీయ దృక్పథాలని పెంపొందింప చేయవచ్చని తెలిపారు. కార్యక్రమం అధ్యక్షురాలు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద మాట్లాడుతూ వైజ్ఞానిక రంగంలో అంతర్జాతీయ స్థాయిలో భారతదేశంలో అబ్బురపరిచే ప్రయోగాలు జరగాలని, సైన్స్ పంచే విజ్ఞానంతో విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు.ఈ సందర్భంగా వివిధ విద్యాసంస్థల నుండి విచ్చేసిన 55 మంది విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్ట ప్రదర్శనను సందర్శించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన సైన్స్ ప్రదర్శన కి గాను ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులని అందజేశారు. ఈ సైన్స్ ఎక్స్ పో వీక్షించడానికి స్థానిక పాఠశాలలు , కళాశాల నుంచి సుమారు 1000 మంది విద్యార్థులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో కే. శ్రీలత, డాక్టర్ సిహెచ్. పావని, ఎమ్. పుష్పలత, కే. స్వర్ణలత, బి. సరోజ. డాక్టర్ కే .రాజ్యలక్ష్మి, షాహేదా పర్వీన్, కే. ఉషారాణి, వి. రేణుక, వి. శ్రీలత, జే.రోజా, కుమారి ఎస్. ఆకాంక్ష ,షేక్ దస్తగిరి తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

### సైన్స్ ఎక్స్పోలో ఆకట్టుకున్న సెయింట్ మేరీస్ పాఠశాల నమూనాలు

సింగరేణి మహిళ డిగ్రీ, పీజీ కళాశాల 50 వసంతాల స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం నిర్వహించిన సైన్స్ ఎక్స్పో కార్య క్రమంలో కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠ శాల విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

## నాలుగు లేబర్ కోడ్ లు రద్దయ్యే వరకు పోరాటా న్ని కొనసాగిస్తాం.

*** సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (ఎస్సీ కేఎస్) రాష్ట్ర కార్యదర్శి బి మధు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కార్మిక వర్గానికి నష్టం చేకూరే విధంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువస్తున్న బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలపై ముక్తకంఠంతో దేశవ్యాప్తంగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించడం వల్ల నేడు జరుగుతున్న సార్వత్రిక సమ్మె విజయవంతమైందని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మీ మధు తెలిపారు. సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భారీ ధర్నాను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కూడా ఈ లేబర్ కోడ్ వల్ల నష్టం రాబోతుందని జీతాలు పెంచే హక్కు కోల్పోతామని ,సంఘం పెట్టుకునే హక్కు నిర్వీర్యం చేయబడుతుందని ,కార్మిక వర్గానికి సంక్షేమానికి తూట్లు పొడిచే విధంగా బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ ల ద్వారా కార్మికులను కట్టు బానిసలుగా చేసి పాలన చేయాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వానికి కార్మిక వర్గం ప్రజలు కలిసి సరైన బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు . 4 లేబర్ కోడ్ రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, కార్మికుల్ని కర్షకుల్ని చైతన్యవంతులు చేసి బిజెపికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు భూక్యా రమేష్, రాజేష్ నవీన్, గిరిబాబు, ఎర్రగాని కృష్ణయ్య, సంజీవ్ ,నాగేశ్వరావు బాబు, కరుణాకర్, రవి , నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రైఫిల్ పిస్టల్ షూటింగ్ పోటీలకు ఎంపికైన వెన్నెల ఫౌండేషన్ చైర్మన్ కిషోర్



ప్రజస్ఫూర్తి, కుత్బుల్లాపూర్: వెన్నెల ఫౌండేషన్ చైర్మన్ కిషోర్ జనవరి నెలలో గచ్చిబౌలి లోని తెలంగాణ షూటింగ్ రేంజ్ లో చేరి స్టేట్ హెడ్ కొచ్ వారణాసి సందీప్ కుమార్ దగ్గర రైఫిల్ పిస్టల్ షూటింగ్ విభాగం లో శిక్షణ పొందాడు. జూన్ 21 నుండి జూన్ 30 వరకు గచ్చిబౌలి షూటింగ్ రేంజ్ లో జరిగిన 11వ తెలంగాణ రాష్ట్ర రైఫిల్ & పిస్టల్ పోటీలలో సీనియర్ పురుషుల వ్యక్తిగత విభాగంలో 10 & 50 మీటర్ల (.22 బుల్లెట్) 50 మీటర్ల ప్రోన్ (.22 బుల్లెట్) ఈవెంట్ లో పాల్గొని రాష్ట్ర అర్హత స్కోరు లను సాదించి సౌత్ జోన్, ఓపెన్ నేషనల్ మరియు ప్రీనేషనల్ కాంపిటీషన్స్ కి అర్హత సాధించాడు.135 ఓపెన్ ఇండియా కాంపిటీషన్ రైఫిల్ పిస్టల్ ఈవెంట్ లు త్రిశూల్ షూటింగ్ రేంజ్ ,డెహ్రాడూన్, ఉత్తరాఖండ్ లో జులై 1 వ తారీకు నుండి 9 వరకు జరిగిన పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరుపున సీనియర్ పురుషుల వ్యక్తిగత విభాగంలో లో కిషోర్ 50 మీటర్ల పిస్టల్ (.22 బుల్లెట్) ఈవెంట్ పోటీలో పాల్గొని 40 నిమిషాల్లో 30 బుల్లెట్లు షూట్ చెసి ఒక బుల్లెట్ కి 10 మార్కుల చొప్పున 300 గాను జాతీయ ఎన్నికల స్కోర్ 248 ని సాధించాడు. డిసెంబర్ నెలలో ఢిల్లీలో జరగబోయే నేషనల్ కాంపిటేషన్ కి తెలంగాణ తరుపున ఎంపికయ్యాడు. భారతదేశం నలుమూలల నుండి 50 మీటర్ల పిస్టల్ షూటింగ్ లో మొత్తం 300 మంది పాల్గొనగా వారిలో 20 మంది మాత్రమే జాతీయ స్థాయికి అర్హత సాధించారు. తెలంగాణ రాష్ట్రం నుండి ముగురు ఎంపికకాగా,వారిలో కిషోర్ ఒకరు.

## ప్రజల ప్రాణాలతో ఆడుకుంటే ఊరుకునేది లేదు

*** ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజల ప్రాణాలతో ఆడుకుంటే ఊరుకునేది లేదని, నిందితులు ఎవరైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. బుధవారం శంషిగుడా, హైదర్ నగర్ పరిసర ప్రాంతాలలో గత ఆదివారం నుండి స్థానికంగా ఉన్న కల్లు దుకాణాలలో కల్లు తాగిన కొంత మంది అస్వస్థతకు గురై హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో బాధితులు ఇంకా ఎక్కువ ఉండవచ్చు అనే అనుమానంతో ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి సాయి చరణ్ కాలనీ పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి గత రెండు మూడు రోజుల నుండి కల్లు తాగి వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉన్న బాధితులను గుర్తించి వారి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించారు. వారిని వెంటనే నిమ్స్ హాస్పిటల్ కు తరలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న కల్లు దుకాణాలలో కల్లు తాగిన కొంతమందికి అదే రోజు ఎలాంటి అనారోగ్య లక్షణాలు లేకపోయినా, మరుసటి రోజు ఉదయం నుంచి వారిలో ఒక్కొక్కరికి అనారోగ్య సమస్యలు బయటపడ్డాయి అని అన్నారు. వారికి బీపీ పడిపోవడం, వాంతులు, విరేచనాలు, వంటి లక్షణాలతో అస్వస్థతకు గురవ్వడంతో హాస్పిటల్ కు తరలించడం జరిగిందని అన్నారు. అస్వస్థతకు గురైన రోగులకు తెలంగాణ ప్రభుత్వం నిమ్స్ లో ఉచితంగా వైద్య సౌకర్యాలు కల్పించిందన్నారు. కొంతమంది అవగాహన లేక సమస్య గురించి సమాచారం తెలియని రోగులను గుర్తించి వారిని నిమ్స్ హాస్పిటల్ కు తరలించామని అన్నారు. చాలామంది నిజాయితీగా వ్యాపారం చేసేవారు కూడా ఉన్నారని, ఒక్కరూ చేసిన తప్పుకు అందరిని నిందించడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, వెంకట్ నాయక్, శివరాజ్ గౌడ్, లక్ష్మమ్మ, శివ, బాబు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేస్తాం

*** టి ఎస్ సి వి రాష్ట్ర అధ్యక్షుడు హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి**

యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : మునుగోడు నియోజకవర్గంలోని నారాయణపురం మండల కేంద్రంలో తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్రస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, మునుగోడు నియోజకవర్గ కంటెస్టెండ్ ఎమ్మెల్యే అభ్యర్థి హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాబోయేటటువంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ సామాజిక చైతన్యత కార్యకర్తలు యువకులు రాష్ట్రవ్యాప్తంగా జడ్పిటిసి ఎంపీటీసీ సర్పంచ్ వార్డ్ నెంబర్స్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా పోటి చేయడానికి ముందుకొస్తూ మమ్మలను సంప్రదిస్తున్న సందర్భంగా కార్యకర్తల అభిప్రాయం మేరకు రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో అభ్యర్థుల నిలబెడుతున్నామని తెలియజేశారు అదేవిధంగా రైతు రుణమాఫీ రైతుబంధు విషయంలో రైతులకు జరుగుతున్నటువంటి అన్యాయాల పైన త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు కొర్ర సాగర్ నాయక్, కొల్ల మహేష్ ముదిరాజ్, లింగం యాదవ్, సింగం కృష్ణ, గజేంద్ర, దువ్వ నవీన్, నక్కరాజు, అనుమల శ్రీరామ్, ఈసం రామకృష్ణ అనేకమంది కార్యకర్తలు పాల్గొన్నారు

## విద్యార్థి దశ నుండి చక్కటి క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

*** (రిటైర్డ్ ఆర్మీ మేజర్), ఆర్మీ కెప్టెన్ కె.విశ్వనాథ్ రెడ్డి**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థి దశ నుండి చక్కటి క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని (రిటైర్డ్ ఆర్మీ మేజర్), ఆర్మీ కెప్టెన్ కె.విశ్వనాథ్ రెడ్డి అన్నారు. సుభాష్నగర్ డివిజన్ పరిధి ఎస్ఆర్ నాయక్ నగర్ లో గల సత్యవాణి విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం ఇన్వెస్టరి సెర్మని కార్యక్రమం నిర్వహించారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులచే ఎన్నుకోబడిన స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ గా మాహిన్ ఫాతిమా, హెడ్ బాయ్ గా ఉద్దీష్ కుమార్, హెడ్ గర్ల్ గా ప్రీతి మంజరి, సి. సి .ఏ . గా " సంజన , కార్తీక్, స్పోర్ట్స్ కెప్టెన్ లుగా మను శ్రీ , సమీర్ వల్లి లుగా విద్యార్థిని విద్యార్థులకు బ్యాడ్జిస్, స్లాషెస్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులుగా ఎదగడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ప్రతి విద్యార్థి కి ఒక గొప్ప వేదికగా వరంగా భావించాలి అని తెలిపారు. చదువుతోపాటు సంస్కారం సంప్రదాయం భారతదేశ ఔన్నత్యం దేశభక్తుడిగా దేశ పౌరుడిగా ఎదిగి నిలవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థిని విద్యార్థులు చైతన్యవంతులై ఉత్తమ పౌరులుగా రాణించాలని హితవు పలికారు. కుత్బుల్లాపూర్ మండలంలో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యొక్క పేరు ప్రఖ్యాతలు ముఖ్యంగా డిస్ప్లిన్ లో ఉత్తమ ఫలితాలు సాధించడంలో మీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ గురించి తెలిసి ఆనందించాను అని కళ్ళ ముందు కనిపిస్తున్న మీ క్రమశిక్షణ, మీరు చేసిన మార్చ్ ఫాస్ట్, గౌరవ వందనం అందుకు నిదర్శనమని దేశభక్తితో కూడినవిగా ఉన్నాయని పొగిడారు టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి. కోటి రెడ్డి , అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి లు విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన కోరని రాజ్ కుమార్



హైదరాబాద్ 09, జూలై (ప్రజాస్ఫూర్తి) : రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసురి ధనసరి అనసూయ (సీతక్క) పుట్టినరోజు పురస్కరించుకొని పెద్ద ఎత్తున ఆమె శ్రేయోభిలాషులు అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సామాన్య ప్రజల నుండి ఉన్నత శ్రేణి రాజకీయ నాయకులు వరకు ఎంతో గుర్తింపు అభిమానం సంపాదించుకున్న మంత్రి సీతక్క పుట్టినరోజును ఆమెకు శుభాకాంక్షలు తెలియజేయడం ద్వారా ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో బుద్వేల్, రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రెటరీ కోరని రాజ్ కుమార్ మంత్రి సీతక్కను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పుష్పగుచ్ఛం, పెన్సిల్ తో గీచిన సీతక్క చిత్ర పటాన్ని అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సీతక్క మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి సామాన్య ప్రజలకు అండగా నిలవాలని కోరని రాజ్ కుమార్ ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ ఈటెల రాజేందర్



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మూసాపేట డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ మామయ్య రాములు మృతి చెందడంతో బుధవారం వారి కుటుంబ సభ్యులను మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ పరామర్శించారు. ఇటీవలే రాములు చనిపోవడంతో విషయం తెలుసుకున్న ఈటెల ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేందర్, సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పాశమైలారం ఘటన.. ఆ 8మంది చనిపోయినట్లే!



హైదరాబాద్: సిగాచీ పరిశ్రమ ప్రమాదం విషయంలో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ఘటనలో 8 మంది ఆచూకీ లభించడం కష్టమేనని నిర్ణయానికి వచ్చారు. రాహుల్, శివాజీ, వెంకటేష్, విజయ్, అఖిలేష్, జస్టిన్, రవి, ఇర్ఫాన్లు పూర్తిగా కాలి బూడిదైపోయి ఉంటారని భావిస్తున్నారు. ఆచూకీ లభించని ఆ 8 మంది చనిపోయినట్లుగా అధికారులు ప్రకటించారు. అంత్యక్రియలకు సంబంధించిన కార్యక్రమాలు చేసుకోవాలని వారి కుటుంబ సభ్యులకు సూచించారు. ఆచూకీ తెలిస్తే సమాచారమిస్తామని బాధిత కుటుంబాలకు తెలిపారు. డీఎన్ఏ గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో ఇదివరకు 44 మృతదేహాలు గుర్తించిన విషయం తెలిసిందే.

# గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం: కృష్ణా జలాలపై మంత్రి ఉత్తమ్ సంచలన వ్యాఖ్యలు

* ఏపీకి మేలు చేసేలా కేసీఆర్ సర్కార్ వ్యవహరించిందన్న ఉత్తమ్
* రాయలసీమ లిఫ్ట్ టెండర్లకు పరోక్షంగా సహకరించారని విమర్శ
* పదేళ్లలో కీలక ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని వ్యాఖ్య

గత పదేళ్ల పాలనలో కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇది ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేసేందుకు జరిగిన కుట్ర అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వం కీలక ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్లే రాష్ట్రం తన హక్కులను కోల్పోయిందని ఆయన విమర్శించారు. బుధవారం ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో నీటిపారుదల ప్రాజెక్టులపై ఆయన పవర్‌పాయింట్ ప్రజెం



టేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. "ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను గత పదేళ్లలో పూర్తి చేసి ఉంటే, కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా దక్కేది. కానీ, గత ప్రభుత్వం వాటిని పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది" అని అన్నారు. అంతేకాకుండా, 2016లో కృష్ణా జలాల్లో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని అపెక్స్ కౌన్సిల్‌కు గత ప్రభుత్వం లిఖితపూర్వకంగా తెలిపిందని ఆయన గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని భారీగా పెంచుకుంటున్నా, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ చేపట్టినా గత ప్రభుత్వం అడ్డుకోలేకపోయిందని ఉత్తమ్ ఆరోపించారు. "రాయలసీమ లిఫ్ట్ టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని కుట్రపూరితంగా వాయిదా వేశారు. దీనివల్ల ఏపీకి మేలు జరిగింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే నాగార్జునసాగర్ ఆయకట్టు ఎడారిగా మారే ప్రమాదం ఉంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2019కి ముందే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే రాష్ట్రానికి ఎంతో మేలు జరిగేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## కేంద్ర ప్రభుత్వం ఇప్పుడేం చెబుతుంది? : కవిత

* గుజరాత్‌లో కుప్పకూలిన గంభీర వంతెన
* ప్రమాదంలో పది మందికి పైగా మృతి
* ప్రజల ప్రాణాలకు గ్యారెంటీ లేదన్న కవిత



గుజరాత్‌లో మరో వంతెన కూలిన ఘటనపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న ఈ ప్రమాదాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ గొప్పగా చెప్పుకునే 'గుజరాత్ మోడల్', 'డబుల్ ఇంజన్ సర్కార్' పనితీరు ఇదేనా అంటూ ఘాటు విమర్శలు చేశారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లోనే వంతెనలు ఎందుకు కూలుతున్నాయని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ ఘటనతో బీజేపీ డబుల్ ఇంజన్ మోడల్ మరోసారి బయటపడిందని ఆయన అన్నారు. ప్రజల ప్రాణాలు తీస్తున్న ఇలాంటి నిర్లక్ష్యంపై బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారుల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) లేదా ఇతర ఏజెన్సీలతో ఈ ఘటనపై విచారణ జరిపించాలని కోరారు. ఇదే అంశంపై ఎమ్మెల్సీ కవిత కూడా స్పందిస్తూ, డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో ప్రజల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయిందని విమర్శించారు. "మొన్న మోర్బీ వంతెన కూలి వందల మంది చనిపోయిన ఘటన మరువక ముందే, ఇప్పుడు గంభీర వంతెన కూలి పది మంది మృతి చెందడం బాధాకరం. బీజేపీయేతర రాష్ట్రాల్లో చిన్న సంఘటన జరిగితే రాద్ధాంతం చేసే కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ఏం సమాధానం చెప్తుంది?" అని కవిత ప్రశ్నించారు. గుజరాత్‌లోని వడోదర జిల్లాలో మహిసాగర్ నదిపై ఉన్న గంభీర వంతెన మంగళవారం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో పలు వాహనాలు నదిలో పడిపోగా, సుమారు పది మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

## రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి కేంద్రమంత్రి గ్రీన్ సిగ్నల్..
# యూరియా అధిక వాడకంపై ఆందోళన

* తెలంగాణకు అవసరమైన యూరియా సరఫరాకు జేపీ నడ్డా హామీ
* ఎరువుల సరఫరాకు మంత్రి జేపీ నడ్డా ఆదేశాలు
* యూరియా వాడకం 21 శాతం పెరగడంపై కేంద్రం ఆందోళన
* ఎరువులు పక్కదారి పట్టకుండా చూడాలని అధికారులకు సూచన
* సేంద్రియ సాగుకు 'ప్రణామ్' పథకం ద్వారా ప్రోత్సాహం

తెలంగాణకు అవసరమైన యూరియా కోటాను పెంచాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. రాష్ట్ర రైతాంగానికి ఎరువుల కొరత



రాకుండా చూస్తామని హామీ ఇచ్చింది. అయితే, అదే సమయంలో రాష్ట్రంలో యూరియా వాడకం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో భేటీ అయి రాష్ట్రానికి యూరియా కోటాను పెంచాలని కోరారు. ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా యూరియాను వెంటనే సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. సరఫరా అయిన యూరియాను వ్యవసాయేతర పనులకు మళ్లించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అన్ని జిల్లాలకు సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో, తెలంగాణలో యూరియా వాడకం పెరగడంపై మంత్రి నడ్డా ఆందోళన వ్యక్తం చేశారు. 202425 యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో యూరియా అమ్మకాలు ఏకంగా 21 శాతం పెరిగాయని ఆయన గుర్తు చేశారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. 'ప్రణామ్' పథకం కింద రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని ఆయన వివరించారు.



## హెచ్‌ఎం వేధిస్తున్నారంటూ రోడ్డెక్కిన బాలికలు

* కోటపల్లిలో ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ఆందోళన
* ఫిర్యాదు చేస్తే టీసీ ఇస్తానని బెదిరిస్తున్నారని ఆరోపణ
* ప్రస్తుత హెచ్‌ఎంను తొలగించి మహిళను నియమించాలని డిమాండ్

మండలంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. తమ హెడ్ మాస్టర్ (హెచ్‌ఎం) తీరుకు నిరసనగా విద్యార్థినులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. పీఓ మేడం రావాలంటూ నినాదాలు చేస్తూ నిరసనను వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్‌ఎం అసభ్యకరంగా మాట్లాడుతూ తమను ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థినులు ఆరోపించారు. వసతి గృహంలో సరైన భోజనం పెట్టడం లేదని, ఈ విషయంపై ఎవరికైనా ఫిర్యాదు చేస్తే టీసీ ఇచ్చి పంపిస్తానని బెదిరిస్తున్నారని వాపోయారు. రెండు రోజుల క్రితం కూడా ఇదే విధంగా ఆందోళన చేసేందుకు ప్రయత్నించగా, హెచ్‌ఎం తమను బుజ్జగించి తిరిగి పాఠశాలకు పంపించారని తెలిపారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం వల్లే తాము రోడ్డెక్కాల్సి వచ్చిందని విద్యార్థినులు పేర్కొన్నారు. బాలికల పాఠశాలలో మహిళా హెచ్‌ఎంను నియమిస్తే తమకు ఇలాంటి ఇబ్బందులు ఉండవని, వెంటనే ప్రస్తుత హెచ్‌ఎంను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఆందోళన విషయం తెలుసుకున్న కోటపల్లి ఎస్ఐ రాజేందర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, విద్యార్థినులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## రాజకీయ పార్టీలలో విభేదాలు, గొడవలు సహజమే

* ప్రేమ్ సాగర్ రావుతో విభేదాలపై వివేక్ స్పందన
* జిల్లాకు ఎమ్మెల్యేనే రాజు అని వ్యాఖ్య
* అందరినీ కలుపుకుని ముందుకెళ్తామన్న వివేక్

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుతో తనకు విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ప్రచారానికి రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తెరదించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు. "జిల్లాకు ఎమ్మెల్యేనే రాజు. ఆ రాజుకు మంత్రులుగా మా సహాయం అవసరమైతే తప్పకుండా చేసి పెడతాం" అని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలలో గ్రూపులు, గొడవలు చాలా సాధారణమని, రాష్ట్రంలోని ప్రతి పార్టీలోనూ ఇలాంటివి ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో, "బీఆర్ఎస్‌లో కేటీఆర్, కవిత మధ్య గొడవలు లేవా?" అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో పాత, కొత్త నేతలందరినీ కలుపుకొని ముందుకు వెళ్తామని వివేక్ తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను మీనాక్షి నటరాజన్ గుర్తిస్తున్నారని, అందరికీ తగిన అవకాశాలు వస్తాయని భరోసా ఇచ్చారు. ఇదే సందర్భంగా ఆయన గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మంత్రులను కలవడానికి కూడా ప్రజలకు అవకాశం ఉండేది కాదని ఆరోపించారు. తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలా కాదని, పాశమైలారం ఘటన జరిగిన వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించి ధైర్యం నింపారని గుర్తుచేశారు. గతంలో కొండగట్టులో



అంత పెద్ద ప్రమాదం జరిగినా కేసీఆర్ కనీసం అటువైపు వెళ్లలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా మంత్రులను కలుస్తున్నారని అన్నారు. కార్మికులు, గిగ్ వర్కర్ల హక్కుల కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి కనీస వేతనం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ హామీ ఇచ్చారు.

## ఒవైసీ కాలేజీని కూల్చివేయకపోవడంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందన

* పాతబస్తీ సూరం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఒవైసీ ఫాతిమా కాలేజీ
* 10 వేల మందికి పైగా పేద ముస్లిం యువతులు చదువుకుంటున్నారన్న రంగనాథ్
* మానవతా దృక్పథంతో కూల్చివేత చర్యలను నిలిపివేశామని వెల్లడి

పాతబస్తీలోని సూరం చెరువు పరిరక్షిత ప్రాంతంలో (ఎఫ్‌టీఎల్) ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నిర్మించిన ఫాతిమా కాలేజీ కూల్చివేతకు సంబంధించి వెల్లువెత్తుతున్న విమర్శలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టత ఇచ్చారు. సామాన్యుల నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు, ఒవైసీ కాలేజీ విషయంలో ఎందుకు మినహాయింపు ఇస్తున్నారని వస్తున్న ప్రశ్నలకు ఆయన వివరణ



ఇచ్చారు. ఈ విషయంపై ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ... "ఫాతిమా కాలేజీని ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించినందున గత ఏడాది సెప్టెంబర్‌లోనే కూల్చివేసేందుకు ప్రయత్నించాం. అయితే, ఆ కాలేజీలో 10,000 మందికి పైగా పేద ముస్లిం బాలికలు, యువతులు కేజీ నుంచి పీజీ వరకు ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్యనభ్యసిస్తున్నారని మా దృష్టికి వచ్చింది" అని తెలిపారు. పేద ముస్లిం మహిళల అభ్యున్నతికి ఈ విద్యాసంస్థ ఎంతో దోహదపడుతోందని ఆయన అన్నారు. ఒక సామాజిక ప్రయోజనం కోసం నడుస్తున్న సంస్థ కావడంతోనే మానవతా దృక్పథంతో ఆలోచించి కూల్చివేత చర్యలను నిలిపివేశామని రంగనాథ్ వివరించారు. అయితే, ఇతర ఎంఐఎం నేతల అక్రమ నిర్మాణాల విషయంలో కఠినంగానే వ్యవహరించామని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కబ్జా చేసిన అనేక భారీ నిర్మాణాలను కూల్చివేశాం. సుమారు రూ.1000 కోట్ల విలువైన ఆస్తులను మజ్లిస్ నాయకుల నుంచి స్వాధీనం చేసుకున్నాం. చాంద్రాయణగుట్టలో ఓ ఎంఐఎం కార్పొరేటర్ స్థలాన్ని కూడా రికవరీ చేశాం" అని ఆయన గుర్తుచేశారు. కేవలం సామాజిక కారణాలతోనే ఫాతిమా కాలేజీపై చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నామని, దీన్ని బలహీనతగా చూడవద్దని ఏవీ రంగనాథ్ పరోక్షంగా ప్రస్తావించారు.

## హైడ్రా ఎఫెక్ట్.. జలకళ సంతరించుకున్న బతుకమ్మ కుంట

* చెత్త దిబ్బ నుంచి 4 నెలల్లోనే రూపు మార్చుకున్న చెరువు
* రూ.7 కోట్లతో బతుకమ్మ కుంట సుందరీకరణ
* బతుకమ్మ పండగ నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేనున్న అధికారులు

ఒకప్పుడు చెత్తాచెదారం, నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి కనుమరుగైన బాగ్ అంబర్‌పేట్‌లోని బతుకమ్మ కుంట ఇప్పుడు



జలకళతో ఉట్టిపడుతోంది. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే హైదరాబాద్ లేక్ డెవలప్‌మెంట్ అండ్ కన్జర్వేషన్ అథారిటీ (హైడ్రా) అధికారులు చెరువు రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు సుదీర్ఘకాలం చేసిన పోరాటం, న్యాయస్థానం జోక్యంతో ఈ అభివృద్ధి పనులు సాధ్యమయ్యాయి. ప్రభుత్వ రికార్డుల ప్రకారం 14 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు, కాలక్రమేణా కబ్జాలకు గురై కేవలం 5.15 ఎకరాలకు పరిమితమైంది. దీని పరిరక్షణ కోసం వీహెచ్ పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చివరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లడంతో పనుల్లో కదలిక వచ్చింది. ఓ వ్యక్తి ఈ స్థలం తనదంటూ కోర్టును ఆశ్రయించినా, అది చెరువేనని హైకోర్టు స్పష్టం చేయడంతో అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో రూ.7 కోట్ల వ్యయంతో హైడ్రా అధికారులు అభివృద్ధి పనులు చేపట్టారు. చెరువులో పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించి పూడిక తీస్తుండగా, భూగర్భ జలాలు ఒక్కసారిగా పైకి ఉబికివచ్చి చెరువును నింపేశాయి. ఇది డ్రైనేజీ నీరు కాదని, స్వచ్ఛమైన భూగర్భ జలమేనని వాటర్‌బోర్డు అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పిల్లల పార్క్, ఓపెన్ జిమ్, బతుకమ్మ వేడుకల కోసం ప్రత్యేక వేదిక నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రానున్న సెప్టెంబర్ నాటికి, బతుకమ్మ పండగ సమయానికి చెరువును పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు.

# మహిళలను అవమానిస్తే సహించం.. వైసీపీపై భువనేశ్వరి తీవ్ర ఆగ్రహం

* వైసీపీ నేత ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలపై నారా భువనేశ్వరి తీవ్ర ఆగ్రహం
* ఇది మహిళల పట్ల వైసీపీకి ఉన్న ద్వేషానికి నిదర్శనమని విమర్శ
* ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి సంఘీభావం తెలిపిన భువనేశ్వరి
* అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు వెల్లడి
* స్త్రీల గౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించబోమని స్పష్టీకరణ



వైసీపీ నేత ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మహిళల పట్ల ఆ పార్టీకి ఉన్న ద్వేషాన్ని, వ్యతిరేక మనస్తత్వాన్ని బయట పెట్టాయని నారా భువనేశ్వరి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని, ఆమెకు తన పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నానని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ... "మహిళల పట్ల వైసీపీ నేతల తీరు అత్యంత సిగ్గుచేటు. సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలకు ఏమాత్రం స్థానం లేదు" అని అన్నారు. మహిళలను ఉద్దేశించి అవమానకరమైన పదాలు వాడినంత మాత్రాన వారి విలువ ఏమాత్రం తగ్గదని స్పష్టం చేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలు స్త్రీల గౌరవాన్ని ఎప్పుడూ ఉన్నత స్థానంలో నిలబెట్టాయని గుర్తుచేశారు. స్త్రీల గౌరవానికి భంగం కలిగించే ఏ ప్రయత్నాన్నైనా ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళలకు మద్దతుగా, వారి గౌరవాన్ని కాపాడటానికి అందరం ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందని భువనేశ్వరి చెప్పారు.

## పోలీసులకు మరోసారి సీరియస్ వార్నింగ్ ఇచ్చిన జగన్

* రైతుల పట్ల పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ జగన్
* ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండదని పోలీసులకు హెచ్చరిక
* రాబోయేది జగన్ ప్రభుత్వమనేది గుర్తుంచుకోవాలని వ్యాఖ్య



"ఎల్లకాలం ఇదే ప్రభుత్వం అధికారంలో ఉండదు. రేపు రాబోయేది జగన్ ప్రభుత్వం. ఈ విషయం గుర్తుంచుకోండి" అంటూ హెచ్చరికలు జారీ చేశారు. గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న మామిడి రైతులను పరామర్శించేందుకు బుధవారం ఆయన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా రైతుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "రైతుల తలలు పగలగొడతారా? 1,200 మందిని జైళ్లలో పెడతారా? అసలు రాష్ట్రంలో ఉంది పోలీసులా? రాక్షసులా?" అంటూ జగన్ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. రైతులను రౌడీ షీటర్లలా పరిగణిస్తూ దురుసుగా ప్రవర్తించడం సరికాదని మండిపడ్డారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ ప్రలోభాలకు, ఇచ్చే లంచాలకు లొంగవద్దని పోలీసులకు హితవు పలికారు. "రేపు ఇదే చంద్రబాబు మిమ్మల్ని కూడా మోసం చేయొచ్చు. అప్పుడు మీ తరఫున పోరాటం చేయాల్సి వచ్చేది కూడా నేనే" అని జగన్ అన్నారు. కనీస మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మామిడి రైతుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ, వారి పక్షాన నిలబడతానని భరోసా ఇచ్చారు. జగన్ పర్యటనతో బంగారుపాళ్యంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

# పవన్ ను కలిసిన ఏపీ బీజేపీ నూతన అధ్యక్షుడు

* జనసేన కార్యాలయంలో పవన్ ను కలిసిన మాధవ్
* మాధవ్ కు శుభాకాంక్షలు తెలిపిన పవన్
* కూటమి కార్యాచరణ, సమన్వయంపై కీలక చర్చలు



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు మాధవ్ భేటీ అయ్యారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి మాధవ్ వెళ్లారు. ఈ సందర్భంగా మాధవ్‌ను పవన్ శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీగానే కాకుండా, రెండు పార్టీల మధ్య రాజకీయ సమన్వయంపై చర్చించేందుకు వేదికగా నిలిచింది. ఈ సమావేశంలో ప్రధానంగా కూటమి ప్రభుత్వ కార్యాచరణ, ప్రభుత్వంలో భాగస్వామ్యం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై ఇరువురు నేతలు చర్చించారు. ముఖ్యంగా, మిత్రపక్షాలైన జనసేన, టీడీపీ, బీజేపీల మధ్య మరింత సమన్వయం పెంచుకోవడమే లక్ష్యంగా వీరి మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. కాగా, అంతకుముందు విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాధవ్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. గతంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేసిన మాధవ్‌కు ఆర్ఎస్ఎస్, బీజేవైఎంలో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉంది.

## ముగ్గురు మూర్ఖులు జగన్ ను ఆపగలరా?:పేర్ని నాని

* కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని తీవ్ర ఆగ్రహం
* జగన్ చిత్తూరు పర్యటనను అడ్డుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు
* రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదని తీవ్ర విమర్శ

వైసీపీ అధినేత జగన్ పర్యటనలను అడ్డుకోవడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, కానీ "ముగ్గురు మూర్ఖులు కలిసి జగన్‌ను ఆపగలరా?" అని మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యరశ్మిని ఆపడం ఎవరివల్లా కాదని, అలాగే జగన్‌ను కూడా ఎవరూ నిలువరించలేరని ఆయన వ్యాఖ్యానించారు. జగన్ చిత్తూరు పర్యటన ఖరారవ్వగానే ప్రభుత్వం భయపడిపోయిందని పేర్ని నాని ఎద్దేవా చేశారు. "జగన్ వస్తున్నారని తెలిసి మార్కెట్ యార్డును మూసివేయించారు. పంట కొనే వ్యాపారులను, రైతులను రావొద్దని అడ్డుకున్నారు. ఇది ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనం" అని ఆయన అన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర కష్టాల్లో ఉంటే, వారి గోడు వినే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. "164 సీట్లు గెలిచామని జబ్బలు చరుచుకుంటున్న కూటమి నేతలు, ప్రజల సొమ్ముతో హెలికాప్టర్లలో తిరుగుతూ సోకులు చేసుకుంటున్నారు. కానీ ధాన్యం, పెసలు, మినుముల రైతులకు గిట్టుబాటు ధర దొరక్క అల్లాడుతుంటే పట్టించుకోవడం లేదు. ఇది రాష్ట్రానికి పట్టిన దరిద్రం" అని నాని విమర్శించారు. మామిడి రైతులను పరా



మర్శించేందుకు జగన్ వస్తానని చెప్పేంతవరకు ప్రభుత్వానికి స్పృహే లేదని అన్నారు. తాము 3.5 లక్షల టన్నుల మామిడి కొన్నామని, సబ్సిడీ ఇచ్చామని ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ అబద్ధాలని, ఒక్క రైతుకైనా లబ్ధి చేకూరినట్లు నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. మీకు నిజంగా చేతనైతే మామిడికి గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

## జనసేనలో చేరుతున్నారనే వార్తలపై వైసీపీ నేత జక్కంపూడి క్లారిటీ

* జనసేనలో చేరుతున్నామనే వార్తల్లో నిజంలేదన్న జక్కంపూడి
* తాము జగన్ వెంటనే ఉంటామని స్పష్టీకరణ
* చిరంజీవిపై తమ కుటుంబానికి ఎనలేని అభిమానం ఉందని వెల్లడి



తమ కుటుంబం జనసేన పార్టీలో చేరుతోందంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని రాజానగరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత జక్కంపూడి రాజా స్పష్టం చేశారు. తాము జగన్ వెంటే నడుస్తామని తేల్చిచెప్పారు. ఇదే సమయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజమండ్రిలో మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ పదవిలో ఉండి కూడా బాధ్యతలు నిర్వర్తించకుండా సినిమాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. పదవిలో లేకపోయినా తాము నిత్యం ప్రజల మధ్యే ఉంటున్నామని అన్నారు. "ఎన్నికల ముందు ఒక మహిళకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసిన పవన్, ఇప్పుడు రాష్ట్రంలో ఎంతోమంది మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని ఆయన నిలదీశారు. కొందరు జనసేన సైకో ఫ్యాన్స్ తమపై పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రాజకీయంగా గుర్తింపు కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సినిమాలు, రాజకీయాలు వేర్వేరని, తమ కుటుంబానికి మెగాస్టార్ చిరంజీవిపై ఎనలేని అభిమానం ఉందని జక్కంపూడి రాజా స్పష్టం చేశారు. తమ తమ్ముడి వివాహానికి ఆహ్వానించేందుకు వెళ్లినప్పుడు, జక్కంపూడి కుటుంబం రాజకీయాల్లో ఉండాలని చిరంజీవి ఆకాంక్షించారని ఆయన గుర్తుచేసుకున్నారు. ఇదే సమావేశంలో, ఆంధ్ర పేపర్ మిల్లు కార్మికుల సమస్యలను కూడా ఆయన ప్రస్తావించారు. జులై 14వ తేదీలోగా కార్మికుల డిమాండ్లు పరిష్కరించకపోతే, తాను గానీ, తన తల్లి గానీ ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఎన్నికల ముందు హామీలిచ్చిన మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ పురందేశ్వరి, ఇతర ఎమ్మెల్యేలు ఇప్పుడు ముఖం చాటేశారని ఆయన ఆరోపించారు.

## పక్కా ప్రణాళికతోనే జగన్ పర్యటనలు చేస్తున్నారు

* శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నిస్తున్నారన్న అచ్చెన్నాయుడు
* ఐదారు జిల్లాల నుంచి జనాలను తరలించడం ఎందుకని ప్రశ్న
* పథకం ప్రకారమే రోడ్లపై మామిడి పండ్లు పోశారని విమర్శ



వైసీపీ అధినేత జగన్ చేపడుతున్న పర్యటనలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన జగన్‌కు లేదని, కేవలం రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకే పక్కా ప్రణాళికతో యాత్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌తో కలిసి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. జగన్ పర్యటనలు సినిమా సెట్టింగుల్లా ఉన్నాయని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. "పరామర్శకు వెళ్తే రైతులను కలిసి మాట్లాడాలి కానీ, ఐదారు జిల్లాల నుంచి జనాన్ని తరలించడం ఎందుకు? ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే రోడ్లపై మామిడి పండ్లను పోశారు. ఇది క్రిమినల్ మైండ్‌తో చేసే పని" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి చర్యలతో సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. తోతాపురి మామిడి రైతుల సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ఈసారి 7 లక్షల మెట్రిక్ టన్నుల బంపర్ క్రాప్ రావడం, పల్ప్ పరిశ్రమల వద్ద గతేడాది నిల్వలు ఉండటంతో ధర పడిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో, పరిశ్రమలతో మాట్లాడి కిలో మామిడిని రూ.8కి కొనేలా ఒప్పించామని, ప్రభుత్వం తరఫున కిలోకు రూ.4 చొప్పున సాయం అందిస్తున్నామని వివరించారు. ఇప్పటికే అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటున్న తర్వాత కూడా జగన్ పర్యటనలు చేయడం వెనుక దురుద్దేశం ఉందని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయాలన్నదే ఆయన లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు.

## చంద్రబాబు, పవన్, లోకేశ్ లకు ధన్యవాదాలు

* నెల్లూరు రాజకీయాల్లో నల్లపరెడ్డి, ప్రశాంతి రెడ్డి మాటల యుద్ధం
* ప్రశాంతి రెడ్డికి మద్దతుగా నిలిచిన కూటమి నేతలు, ప్రజా సంఘాలు



నెల్లూరు జిల్లా రాజకీయాల్లో చోటు చేసుకున్న పరిణామాలపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పందించారు. మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తనపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఖండిస్తూ, తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆమె వీడియో సందేశం ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంఘటనతో నెల్లూరు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ కష్ట సమయంలో తనకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లకు ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. సభ్య సమాజం తలదించుకునేలా తనపై జరిగిన మాటల దాడిని ఖండిస్తూ అండగా నిలిచిన తెలుగుదేశం కుటుంబసభ్యులకు, ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. వీరితో పాటు మంత్రులు, ఎంపీలు, తోటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు, పార్టీ నేతలకు పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పారు. తన కోసం క్షేత్రస్థాయిలో పోరాడిన మహిళలకు, జిల్లావ్యాప్తంగా తరలివచ్చి సంఘీభావం ప్రకటించిన తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అభిమానులకు, కోవూరు నియోజకవర్గ కూటమి నాయకులకు తాను రుణపడి ఉంటానని స్పష్టం చేశారు.

# జనసేనలో చేరిన నలుగురు వైకాపా జడ్పీటీసీలు

మంగళగిరి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకి చెందిన నలుగురు వైకాపా జడ్పీటీసీలు జనసేన పార్టీలో చేరారు. బుధవారం సాయంత్రం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జడ్పీటీసీ సభ్యులు పొల్నాటి శ్రీనివాసరావు (చింతలపూడి), ముత్యాల ఆంజనేయులు (తాడేపల్లిగూడెం), అడ్డాల జానకి (అత్తిలి), శ్రీమతి కొమ్మిశెట్టి రజనీ (పెరవలి) జనసేనలో చేరారు. రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడంలో పవన్ కల్యాణ్ చేస్తున్న కృషి, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తమను అమితంగా ఆకట్టుకున్నాయని జడ్పీటీసీలు తెలిపారు.









# రాజకీయాల నుంచి రిటైర్ అయ్యాక ఏం చేస్తానంటే?: వెల్లడించిన అమిత్ షా

* రాజకీయాల నుంచి వైదొలిగాక తన ప్రణాళిక చెప్పిన అమిత్ షా
* వేదాలు, ఉపనిషత్తులు చదువుతానన్న కేంద్ర మంత్రి
* ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెడతానని వెల్లడి
* రసాయన ఎరువులతో ఆరోగ్య సమస్యలని హెచ్చరిక
* హోం శాఖ కన్నా సహకార శాఖే తనకు పెద్దదని వ్యాఖ్య



రాజకీయ జీవితం నుంచి విరమణ పొందిన తర్వాత తాను ఏమి చేయాలనుకుంటున్నారో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. తన భవిష్యత్ ప్రణాళికలను వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రజా జీవితానికి వీడ్కోలు పలికిన తర్వాత పూర్తి సమయం వేదాలు, ఉపనిషత్తుల అధ్యయనానికి కేటాయిస్తానని తెలిపారు. దీనితో పాటు ప్రకృతి వ్యవసాయంపై కూడా దృష్టి సారిస్తానని చెప్పారు. గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన సహకార సంఘాల మహిళలతో మాట్లాడుతూ ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రసాయన ఎరువులతో పండించే పంటల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి సేద్యం ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని, అదే సమయంలో వ్యవసాయ ఉత్పాదకతను కూడా పెంచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సహకార శాఖ మంత్రిగా తన బాధ్యతల గురించి కూడా అమిత్ షా మాట్లాడారు. తనకు హోం శాఖ అప్పగించినప్పుడు అందరూ అది కీలక శాఖ అన్నారని, కానీ సహకార శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు హోం శాఖ కన్నా అదే పెద్ద శాఖ అని తాను భావించానని అన్నారు.

## చైనాతో కాదు, టిబెట్‌తోనే మాకు సరిహద్దు
## అరుణాచల్ సీఎం పెమా ఖండు కీలక వ్యాఖ్యలు

* అరుణాచల్‌కు చైనాతో సరిహద్దు లేదన్న సీఎం పెమా ఖండు
* తమ సరిహద్దు టిబెట్‌తోనేనని వ్యాఖ్య
* టిబెట్‌ను చైనా బలవంతంగా ఆక్రమించుకుందని వెల్లడి



అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు, చైనాకు గట్టి షాకిచ్చేలా కీలక వ్యాఖ్యలు చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చైనాతో అసలు సరిహద్దే లేదని, తమ రాష్ట్రానికి టిబెట్‌తో మాత్రమే సరిహద్దు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదంపై కొత్త చర్చకు దారితీశాయి. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పెమా ఖండు ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంటర్వ్యూలో భాగంగా, అరుణాచల్ ప్రదేశ్ చైనాతో 1200 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటుందని విలేకరి ప్రస్తావించగా, సీఎం ఖండు వెంటనే కలగజేసుకున్నారు. "ఈ విషయంలో నేను మిమ్మల్ని సరిదిద్దాలి. మాకు చైనాతో కాదు, టిబెట్‌తో సరిహద్దు ఉంది" అని ఆయన వివరించారు. భారతదేశంలోని ఏ రాష్ట్రానికీ చైనాతో సరిహద్దు లేదని ఆయన అన్నారు. చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ, 1950లో చైనా టిబెట్‌ను బలవంతంగా ఆక్రమించుకుందని పెమా ఖండు గుర్తుచేశారు. "అధికారికంగా టిబెట్ ఇప్పుడు చైనా ఆధీనంలో ఉందని మాకు తెలుసు. కానీ వాస్తవానికి మా సరిహద్దు ఎప్పుడూ టిబెట్‌తోనే ఉండేది. అరుణాచల్ ప్రదేశ్ భూటాన్, మయన్మార్‌లతో పాటు టిబెట్‌తో అంతర్జాతీయ సరిహద్దులను పంచుకుంటోంది" అని ఆయన తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌ను తమ భూభాగంలోని దక్షిణ టిబెట్ (జాంగ్నాన్) అని చైనా చాలాకాలంగా వాదిస్తోంది. తమ మ్యాపుల్లో కూడా చూపిస్తూ వివాదాన్ని రాజేస్తోంది. అయితే, చైనా వాదనలను భారత్ ఎప్పటికప్పుడు తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని తేల్చి చెబుతోంది. ఈ నేపథ్యంలో పెమా ఖండు చేసిన వ్యాఖ్యలు చైనా వాదనను మరింత బలహీనపరిచేలా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాలు..
## ప్రియాంక గాంధీతో డీకే శివకుమార్ కీలక భేటీ

* ఢిల్లీలో కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో సమావేశమైన డీకే శివకుమార్
* కర్ణాటక ముఖ్యమంత్రి మార్పుపై మళ్లీ ఊపందుకున్న ఊహాగానాలు
* ప్రియాంక గాంధీతో భేటీ అనంతరం మాట్లాడకుండా వెళ్లిన శివకుమార్
* త్వరలో అధిష్టానంతో సిద్ధరామయ్య కూడా భేటీ అయ్యే అవకాశం



కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి చర్చనీయాంశమైంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీతో సమావేశం కావడంతో ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరినట్లయింది. ముఖ్యమంత్రి పదవి విషయంలో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠ ఈ భేటీతో తారాస్థాయికి చేరింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవిపై సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ల మధ్య ఒప్పందం జరిగిందనే ప్రచారం బలంగా ఉంది. దీని ప్రకారం, తొలి రెండున్నరేళ్లు సిద్ధరామయ్య, ఆ తర్వాత మిగిలిన కాలానికి డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఒప్పందం ప్రకారమే త్వరలో డీకే ముఖ్యమంత్రి అవుతారని ఆయన వర్గం ఎమ్మెల్యేలు, మద్దతుదారులు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కావాలనే తన ఆశను శివకుమార్ కూడా దాచుకోవడం లేదు. ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, "పదవిని ఆశించడంలో తప్పేముంది?" అంటూ తన మనసులోని మాటను పరోక్షంగా బయటపెట్టారు. అయితే, ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాత్రం తాను ఐదేళ్ల పూర్తికాలం పదవిలో కొనసాగుతానని ధీమాగా చెబుతున్నారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రియాంక గాంధీతో డీకే శివకుమార్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. త్వరలోనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా కాంగ్రెస్ అధిష్టానంతో సమావేశమయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## రాజస్థాన్‌లో కుప్పకూలిన యుద్ధ విమానం.. పైలట్ దుర్మరణం

* రాజస్థాన్‌లోని చూరు జిల్లాలో విమాన ప్రమాదం
* ఈ ఘటనలో విమానం నడుపుతున్న పైలట్ మృతి
* ప్రమాద స్థలంలో పైలట్ మృతదేహాన్ని గుర్తించిన అధికారులు
* సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



రాజస్థాన్‌లో బుధవారం విమాన ప్రమాదం సంభవించింది. చూరు జిల్లాలో ఒక విమానం కుప్పకూలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న పైలట్ దుర్మరణం పాలయ్యారు. చూరు జిల్లా పరిధిలోని ఓ ప్రాంతంలో ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన జాగ్వార్ ఫైటర్ జెట్ విమానం కూలిపోయినట్లు స్థానిక అధికారులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు, సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. అక్కడ విమాన శకలాలను, పైలట్ మృతదేహాన్ని గుర్తించారు. ఈ ప్రమాదం జరగడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాద సమాచారం తెలియడంతో ఉన్నతాధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## అంతరిక్షంలో రైతు అవతారం..
## మెంతి, పెసర పండిస్తున్న శుభాంశు శుక్లా

* రైతు అవతారమెత్తి మెంతి, పెసర మొక్కల పెంపకం
* జీరో గ్రావిటీలో మొక్కల పెరుగుదలపై అధ్యయనం
* భూమికి చేరాక మొలకలపై జన్యుపరమైన పరిశీలన
* ఆహారం, ఆక్సిజన్ కోసం మైక్రోఆల్గేపైనా ప్రయోగాలు
* యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌కు చేరిన శుక్లా



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సరికొత్త ప్రయోగాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆయన తాజాగా రైతు అవతారమెత్తి అంతరిక్షంలో మనందరికీ సుపరిచితమైన మెంతి, పెసర పంటలను పండిస్తున్నారు. గురుత్వాకర్షణ శక్తి లేని (జీరో గ్రావిటీ) వాతావరణంలో ఈ మొక్కల పెరుగుదల ఎలా ఉంటుందోనని ఆయన అధ్యయనం చేస్తున్నారు. ఈ ప్రయోగంలో భాగంగా, శుభాంశు శుక్లా గాజు పాత్రలలో మెంతి, పెసర విత్తనాలను నాటారు. ఐఎస్ఎస్‌లోని ప్రత్యేక నిల్వ ఫ్రీజర్‌లో వాటిని ఉంచి అవి మొలకెత్తే విధానాన్ని ఫొటోలు తీశారు. ఈ పరిశోధనలో ధార్వాడ్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన రవికుమార్ హోసమణి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన సుధీర్ సిద్ధపురెడ్డి అనే ఇద్దరు శాస్త్రవేత్తలు శుక్లాకు సహకరిస్తున్నారు. యాత్ర ముగించుకుని భూమికి తిరిగి వచ్చాక, ఈ మొలకలలోని జన్యు మార్పులు, పోషక విలువలను విశ్లేషించనున్నట్లు యాక్సియం స్పేస్ సంస్థ తెలియజేసింది. వ్యవసాయ ప్రయోగాలతో పాటు శుభాంశు శుక్లా మరిన్ని కీలక పరిశోధనలు కూడా చేస్తున్నారు. జీరో గ్రావిటీలో ఆహారం, ఆక్సిజన్‌తో పాటు జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యంపై మైక్రోఆల్గేలను అధ్యయనం చేస్తున్నారు. అలాగే, మానవ మూలకణాలు (స్టెమ్ సెల్స్), వ్యోమగాముల మానసిక సామర్థ్యం, కండరాల పనితీరు వంటి అంశాలపైనా పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రయోగాల గురించి శుక్లా మాట్లాడుతూ, "భూమిపై ఉన్న పరిశోధకులకు, అంతరిక్ష కేంద్రానికి మధ్య వారధిగా ఉంటూ ఈ పరిశోధనలు నిర్వహించడం గర్వంగా, ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. యాక్సియం 4 ప్రైవేట్ స్పేస్ మిషన్‌లో భాగంగా శుభాంశు శుక్లా గత వారమే మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి ఐఎస్ఎస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే.

## 26/11 ముంబై దాడుల కేసు..
## తహవర్ రాణాకు మరోసారి కస్టడీ పొడిగింపు

* 26/11 ముంబై ఉగ్రదాడి కేసులో నిందితుడు తహవర్ రాణా
* ఆగస్టు 13 వరకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించిన ఢిల్లీ కోర్టు
* రాణాపై అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసిన జాతీయ దర్యాప్తు సంస్థ
* దాడితో తనకు ఎలాంటి సంబంధం లేదని విచారణలో వెల్లడి
* రెక్కీ, ప్రణాళిక అంతా హెడ్లీదేనని ఆరోపణ



26/11 ముంబై ఉగ్రదాడి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న తహవర్ రాణా జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు మరోసారి పొడిగించింది. బుధవారం ముగిసిన కస్టడీ గడువు నేపథ్యంలో రాణాను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కోర్టు ముందు హాజరుపరచగా, ఆగస్టు 13 వరకు కస్టడీని పొడిగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఇటీవల రాణాపై అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. దర్యాప్తులో భాగంగా సహ నిందితుడు డేవిడ్ కోల్‌మన్ హెడ్లీతో రాణా జరిపిన టెలిఫోన్ సంభాషణల రికార్డింగ్‌లతో సరిపోల్చేందుకు అధికారులు ఇప్పటికే రాణా గొంతు, చేతిరాత నమూనాలను సేకరించారు. దాడుల కోసం లక్ష్యాలను ఎంపిక చేసేందుకు హెడ్లీకి అవసరమైన మ్యాప్‌లు, సూచనలతో కూడిన చేతిరాత నోట్లను రాణానే అందించాడని ఎన్ఐఏ అనుమానిస్తోంది. అయితే, ఎన్ఐఏ విచారణలో రాణా తనపై ఉన్న ఆరోపణలను పూర్తిగా ఖండించాడు. ముంబై దాడుల ప్రణాళికతో గానీ, వాటిని అమలు చేయడంతో గానీ తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నాడు. తన చిన్ననాటి స్నేహితుడైన హెడ్లీనే రెక్కీ, ప్రణాళిక మొత్తం చూసుకున్నాడని, ఈ దాడికి పూర్తి బాధ్యత అతడిదేనని రాణా తెలిపాడు. విచారణ సమయంలో తాను ముంబై, ఢిల్లీతో పాటు కేరళకు కూడా వెళ్లినట్లు అంగీకరించాడు. ఒక పరిచయస్తుడిని కలిసేందుకే కేరళ వెళ్లినట్లు చెప్పి, ఆ వ్యక్తి వివరాలను అధికారులకు అందించాడు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై కేఏ పాల్ కీలక ప్రకటన

* జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పోటీ చేస్తామన్న కేఏ పాల్
* బీసీ నేతలను బీజేపీ వాడుకుని వదిలేస్తోందని మండిపాటు
* జైలు నుంచి వచ్చిన తర్వాత కవిత బీజేపీ గానం చేస్తోందని విమర్శ



బీసీ నేతలను బీజేపీ కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుని వదిలేస్తోందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈటల రాజేందర్‌కు బీజేపీలో ఇదే గతి పట్టిందని విమర్శించారు. బీసీ నేత బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించిన బీజేపీ, ఇప్పుడు బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పాల్ ఎద్దేవా చేశారు. "బీసీ పార్టీ అని చెప్పుకునే బీజేపీ, బండి సంజయ్‌ను ఎందుకు పదవి నుంచి దించేసింది? ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్ వంటి బీసీ నేతలను కాదని బ్రాహ్మణ వర్గానికి చెందిన రాంచందర్ రావుకు ఎలా అవకాశం కల్పించారు?" అని ఆయన ప్రశ్నించారు. తాను బ్రాహ్మణులకు వ్యతిరేకిని కాదని, కానీ బీజేపీ బీసీ ముసుగు ధరించి ఇలాంటి పనులు ఎలా చేస్తుందని నిలదీశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపైనా పాల్ విమర్శలు గుప్పించారు. కొద్ది రోజులు జైలులో ఉండి రాగానే కవిత బీజేపీ గానం చేస్తున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసమే కవితను బీసీ నినాదంతో తెరపైకి తెచ్చారని అన్నారు. రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజాశాంతి పార్టీ కూడా పోటీ చేస్తుందని కేఏ పాల్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఛంగూర్ బాబా అరాచకాలు.. అప్పట్లో సైకిల్‌పై.. ఇప్పుడు రూ.100కోట్లకు పైనే ఆస్తులు!

చట్టవిరుద్ధంగా మత మార్పిడిలకు పాల్పడుతున్న ఓ ముఠాను ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. కీలక సూత్రధారిగా జమాలుద్దీన్ అలియాస్ ఛంగూర్ బాబాను గుర్తించిన పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ రాకెట్ మూలాలను గుట్టువిప్పే పనిలో నిమగ్నమైన పోలీసులు కీలక విషయాలు కనుగొన్నారు. ఒకప్పుడు సైకిల్‌పై తిరుగుతూ ఉంగరాలు, తాయత్తులు అమ్మిన ఆయనకు ఇప్పుడు 40 బ్యాంకు అకౌంట్లు, రూ.106కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. ఇవన్నీ పశ్చిమాసియా దేశాల నుంచి వచ్చినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బలరాంపుర్‌లో మతమార్పిడి రాకెట్‌ను ఛేదించిన పోలీసులు.. ఛంగూర్ బాబాతో పాటు అతడి ముఠా సభ్యులను లఖ్‌నవూలో అదుపులోకి తీసుకున్నారు. పేదలు, నిస్సహాయ కూలీలు, వెనుకబడిన వర్గాలు, వితంతు మహిళలను లక్ష్యంగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా వారికి నగదు, ప్రోత్సాహకాలతోపాటు కొన్నిసార్లు బెదిరింపులకు పాల్పడుతూ మత మార్పిడులు చేస్తున్నట్లు గుర్తించారు.





# మీతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

## వార్-2 మూవీపై కియారా ఆసక్తికర పోస్ట్

టాకీస్: ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'వార్ 2'ఒకటి. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ (కి) ప్రధాన పాత్రల్లో నటించారు. కియారా అద్వాణీ హీరోయిన్‌గా కనిపించనున్నారు. తాజాగా ఆమె ఈ సినిమాపై పోస్ట్ పెట్టారు. ప్రపంచం దీన్ని ఎప్పుడు చూస్తుందా అని ఆసక్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు- తెలుపుతూ తారక్, హృతిక్‌లు పోస్ట్‌లు పెట్టారు. అందులో హృతిక్ పోస్ట్‌ను షేర్ చేసిన కియారా..ఈ సినిమా విషయంలో మీరెంత ఆసక్తిగా ఉన్నారో నేనూ అలానే ఉన్నాను. మీతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. ఎన్టీఆర్‌తో కలిసి అయాన్ ముఖర్జీ సృష్టించిన అద్భుతాన్ని ప్రపంచం ఎప్పుడు చూస్తుందా అని ఎదురుచూస్తున్నాను. మన టీ-మ్ మొత్తం ఈ సినిమాకు ప్రాణం పోసిందని రాసుకొచ్చారు. ఇటీవల ఈ సినిమాపై పోస్ట్ పెట్టిన ఎన్టీఆర్.. హృతిక్ ఎనర్జీ తననెంతో ఆకర్షించిందని తెలిపారు. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు- చెప్పారు. 'వార్ 2'తో అయాన్ ప్రేక్షకులకు పెద్ద సర్‌ప్రైజ్ సిద్ధం చేశారంటూ అభిమానుల్లో జోష్ నింపారు. హిట్ మూవీ 'వార్'కు సీక్వెల్ రూపొందిన స్పై థ్రిల్లర్ సినిమా ఇది. భారీ మల్టీస్టారర్‌గా రూపొందుతోన్న ఈ సినిమాను ప్రకటించిన నాటినుంచి ప్రేక్షకుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఆగస్టు 14న ఈ చిత్రం విడుదల కానుంది.



# మెగాస్టార్ మూవీకి ప్రత్యేక ప్రమోషన్




**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి-అనీల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా షూటింగ్ వేగంగా ముందుకు సాగుతోంది. ఆర్‌ఎఫ్‌సిలో షూటింగ్ సాగుతోంది. నయనతార ఇందులో హీరోయిన్‌గా నటిస్తుండ గా, ఈ కాంబినేషన్ పై అభిమానుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవితో చేస్తున్న ఈ ప్రాజెక్ట్ విషయంలో అయితే ఈ ప్రమోషన్‌కి మరింత వెయిట్ కలిగింది. సినిమా షూటింగ్ దశలోనే నయనతార క్యారెక్టర్ ఇంట్రడక్షన్‌తోనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ఇక తాజాగా.. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించిన మరో స్పెషల్ సర్ప్రైజ్ బయటకు వచ్చింది. ప్రముఖ ఛానల్ జీ తెలుగు లో ప్రసారమయ్యే ఓ ప్రత్యేక కార్యక్రమంలో చిరంజీవి ఈ సినిమా ప్రమోషన్ లో భాగంగా హాజరయ్యారు. ఈ ఎపిసోడ్ త్వరలోనే టెలికాస్ట్ కానుండగా, ఇప్పటికే రిలీజైన ప్రోమో వైరల్‌గా మారింది. అసలే బుల్లితెర ప్రేక్షకులకి చిరంజీవి ప్రత్యక్షంగా కనిపించడం అంటేనే పండుగ లాంటిది. దీంతో మెగా అభిమానులు, టీవీ వీక్షకులు ఈ ఎపిసోడ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మొత్తానికి ఈ సినిమాని డిజైన్ చేయడంలో అనిల్ రావిపూడి ప్రత్యేకమైన వ్యూహంతో ముందుకెళ్తున్నట్లు- తెలుస్తోంది. టార్గెటెడ్ ప్రోమోషన్ రూపంలో సినిమా మీద బజ్‌ను నెమ్మదిగా పెంచుతున్నాడు. ఇది థియేటర్‌ల వద్ద మంచి ఓపెనింగ్స్ రాబట్టేందుకు ఉపయోగపడేలా ఉన్నది.

# సిద్ధూ కొత్త సినిమా బడాస్



**టాకీస్:** టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని వరుస సినిమాలతో అలరిస్తు న్నారు యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ . తాజా గా ఆయన మరో కొత్త సినిమాను ప్రకటించారు. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఓ ఆసక్తికర పోస్టర్‌ను పంచుకుంది. 'బడాస్' పేరుతో ఇది రానున్నట్లు తెలిపింది. రవికాంత్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్-టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది 'బడాస్' విడుదల కానుంది. మీరు ఇప్పటివరకూ హీరోలను, విలన్‌లను చూసి ఉంటారు. కానీ, ఇప్పుడు వారికి మించి చూస్తారు. ఈసారి కనికరం లేకుండా ఫైర్ సెట్ చేస్తాడు అని నిర్మాణ సంస్థ ప్రకటించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్నారు సిద్ధూ జొన్నలగడ్డ. ఇటీవల 'జాక్' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు. అయితే ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ప్రస్తుతం ఆయన 'తెలుసు కదా'లో నటిస్తున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. నీరజ కోన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది.

# ఆగస్ట్7న కూలీ ప్రీ రిలీజ్ ఈవెంట్




**టాకీస్:** తమిళ్ సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'కూలీ'. తమిళ టాప్ దర్శకుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉ న్నాయి. అక్కినేని నాగార్జున, కన్నడ రియల్ స్టార్ ఉపేంద్ర, మలయాళ నటు-డు సౌబిన్ సాహిర్, కట్టప్ప సత్యరాజ్ వంటి స్టార్స్ నటిస్తున్న ఈ బిగ్గెస్ట్ మల్టీస్టారర్ ఆగస్టు 14న వరల్డ్ వైడ్ రిలీజ్ కాబోతుంది. ఈ నేపధ్యంలో ప్రమోషన్స్ స్టార్ట్ చేస్తూ చికిటు- అని సాగే ఫస్ట్ లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. తెలుగులోను ఈ సినిమాను భారీ ఎత్తున రిలీజ్ చేయబోతున్నారు. కూలీ తెలుగు హక్కులను రూ. 45 కోట్లకు కొనుగోలు చేసారు ఆసియన్ సురేష్. అయితే తెలుగు స్టేట్స్ లో భారీ ఓపెనింగ్ రాబట్టాలంటే ఇప్పుడున్న బజ్ సరిపోదు. అందుకోసం రజినీ రంగంలోకి దిగాలి. ఈ నేపధ్యంలోనే కూలీ తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించేందుకు ఏర్పాట్లు- చేస్తున్నారు. అందుకోసం ఆగస్టు 7 డేట్ ను ఫిక్స్ చేసారు తెలుగు పంపిణీదారులు. ఈ ఈవెంట్ కు సూపర్ స్టార్ రజనీకాంత్ తో పాటు- లోకేష్ కనగరాజ్, అక్కినేని నాగార్జున హాజరుకానున్నారు. కూలీ నుండి సెకండ్ లిరికల్ సాంగ్ ను ఈ వచ్చే వారం విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. అక్కినేని నాగార్జున, పూజ హెగ్డే కాంబోలో రాబోతున్న ఈ సాంగ్ ను అనిరుద్ ఓ రేంజ్ లో ట్యూన్ చేసాడనే టాక్ ఉంది.

# బ్యాడ్ గర్ల్ మూవీకి సెన్సార్ ఓకే

**టాకీస్:** తమిళం నుంచి వస్తున్న వివాదాస్పద చిత్రం బ్యాడ్ గర్ల్. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్, కోలీవుడ్ డైరెక్టర్ వెట్రిమారన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి శివరామన్ కథానాయికగా నటిస్తుంది. వర్షా భరత్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా విడుదలకు సెన్సార్ పలు అడ్డంకులు తెలిపిన విషయం తెలిసిందే. ఈ సినిమా విషయంలో సెన్సార్ బోర్డు మీదా కోర్టు వరకు కూడా వెళ్లాడు వెట్రిమారన్. అయితే ఎన్నో వివాదాలు ఎదుర్కొన్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ చెప్పిన పలు కట్‌లకు చిత్రబృందం అంగీకరించడంతో సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చింది బోర్డు. ఈ క్రమంలోనే ఈ చిత్రం విడుదలకు సిద్ధంమైంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు- చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ టీమ్ పోస్ట్ పెట్టింది. స్కూల్ స్టేజీ నుంచే తోటి విద్యార్థులలాగే తనకు ఓ బాయ్‌ఫ్రెండ్ ఉండాలనుకునే ఓ అమ్మాయి కథ ఈ చిత్రం. ఆచారాలు, కట్టుబాట్లు పాటించే కుటుంబంలో పుట్టిన ఈ అమ్మాయి తనకు నచ్చిన వాడిని ఎలా ఎంపిక




చేసుకుంది. ఈ క్రమంలో ఆ అమ్మాయి జీవితంలో ఎదురైన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ. ఏ గ్రాస్ రూట్ ఫిల్మ్ కంపెనీ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది

# దఢక్ సీక్వెల్‌లో త్రిప్తి డిమ్రి



టాకీస్: మరాఠిలో సూపర్ హిట్ అయిన సినిమా సైరాత్. రెండు వేరు వేరు కులాల మధ్య జరిగిన ప్రేమ కథగా వచ్చిన ఈ సూపర్ హిట్ సినిమా అనేక భాషల్లో రీమేక్ అయి హిట్ అయింది. అలా బాలీవుడ్ లోను దడక్ పేరుతో రీమేక్ చేసారు. శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో ఇషాంత్ కట్టర్ హీరో గా నటించగా ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ నిర్మించగా అజయ్, అతుల్ సంగీతం అందించారు. అలనాటి అందాల తార శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ ఈ సినిమాతోనే సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ-ఇచ్చింది. అయితే ఇప్పుడు ఈ సినిమాకు స్వీక్వెల్ గా దఢక్ 2 ను వస్తోంది. అయితే తీసిందే రీమేక్ సినిమా దానికి మళ్ళి సీక్వెల్, ఏంటో బాలీవుడ్ మేకర్స్ వెర్రి అనే కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్. సరైన కథలు లేక ఇలా రీమేక్స్ తో గడిపేస్తున్నారు అని టాక్ వినిపిస్తోంది. పోనీ సీక్వెల్ ను అయినా ఫస్ట్ పార్ట్ లో నటించిన వారితో చేస్తున్నారా అంటే అది లేదు. సిద్ధాంత్ చతుర్వేది హీరోగా యానిమల్ ఫేమ్ త్రిప్తి డిమ్రి హీరోయిన్ గా తెరకెక్కుతోంది దఢక్ 2. అందుకు సంబంధించి ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేసారు. ఈ సీక్వెల్ కు సాజిద్ ఇక్బాల్ దర్శకత్వం వహిస్తుండగా ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్ పై కరణ్ జోహార్ నిర్మిస్తున్నాడు. జీ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ ఈ నెల 11న రిలీజ్ కానుంది. అలాగే ఈ ఏడాది ఆగస్టు 1న రిలీజ్ కాబోతుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.